హైదరాబాద్ వార్త

కోకాపేట్‌లో గ్యాస్ రీఫిలింగ్‌లో
పేలిన సిలిండర్.. ఇద్దరికి గాయాలు

నార్సింగి, ఆగస్టు 29 ప్రభాతవార్త : గ్యాస్ రీఫిలింగ్‌లో సిలిండర్ పేలి ఇద్దరు వ్యక్తులు గాయాల పాలయ్యారు. ఈ సంఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గండిపేట మండలం కోకాపేట్ గ్రామంలో ఇద్దరు వ్యక్తులు ఓ ఇంటిని అద్దెకు తీసుకొని, ఎలాంటి అనుమతులు లేకుండానే, జాగ్రత్తలు పాటించకుండానే గ్యాస్ రీఫిలింగ్ చేస్తున్నారు. జనావాసాల మధ్య ఇలా చేయడం నేరమని తెలిసినా సదరు వ్యక్తులు దర్జాగా గ్యాస్ రీఫిలింగ్ చేస్తూనే ఉన్నారు. సోమవారం కూడా రీఫిలింగ్ చేస్తుండగా ఒక్కసారిగా సిలిండర్ పేలింది. ఈ సంఘటనల ఒకరికి తీవ్ర గాయాలయ్యాయని, మరొకరు స్వల్పంగా గాయపడ్డారని స్థానికులు తెలిపారు. వీరిద్దరిని చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు కోకాపేట్ కౌన్సిలర్ శివారెడ్డి తెలిపారు. ఇలాంటి గ్యాస్ రీఫిలింగ్ సెంటర్లపై సంబంధిత శాఖ అధికారులు దాడులు చేయాలని, మరోమారు ఇలాంటి దుర్ఘటనలు జరుగకుండా ఉండాలంటే కఠినమైన చర్యలు తీసుకోవాలని శివారెడ్డి డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

లోక కల్యాణార్థం
లక్ష తమలపాకుల పూజోత్సవం

చిక్కడపల్లి, ఆగస్టు 29 ప్రభాతవార్త: భక్తులు తిలకిస్తుండగా, వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య లోకకళ్యాణార్థం లక్ష తమలపాకుల పూజా కార్యక్రమాన్ని వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చిక్కడపల్లి ఆర్యవైశ్య సంఘం పూర్వ అధ్యక్షుడు శ్రీరామ్‌పండరి, చిక్కడపల్లి వాసవీ మహిళా సంఘం అధ్యక్షురాలు శ్రీరాం విజయలక్ష్మి ఆధ్వర్యంలో లక్ష నాగవల్లి పత్రపూజ కార్యక్రమం జరిగింది. ఆలయంలో భక్త బృందంచే హనుమాన్ చాలీసా 108 పారాయణాలతో పాటు లక్ష తమలపాకులతో పూజనునిర్వహించారు.

ఆహారోత్పత్తులపై జీఎస్టీని రద్దు చేయాలి

జిఎస్టీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్యకర్తలు

సైఫాబాద్, ఆగస్టు 29 ప్రభాతవార్త: ఆహారోత్పత్తులపై జీఎస్టీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అనేక మంది సోమవారం బషీర్‌బాగ్‌లోని జీఎస్టీ కార్యాలయం కార్యాలయాన్ని ముట్టడించి ధర్నా నిర్వహించారు. సిపిఐ (ఎం-ఎల్) ప్రజా పంథా ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో అనేక మంది కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజా పంథా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.జి.రామ్‌చందర్, నగర కార్యదర్శి హన్మేశ్, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్ఎల్ పద్మ తదితరులు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన 8 ఏళ్ళ కాలంలో వందల రేట్లలో ధరలు పెంచి సామాన్య ప్రజల నడ్డి విరగగోడుతున్నారని ధ్వజమెత్తారు. కేంద్రం 75 ఏళ్ల స్వాతంత్ర దినోత్సవం అజాదీకా అమృత్ మహోత్సవం జరిపిందని, ఇంటింటికి జెండా పండుగ అన్నదని కాని ధరలను మాత్రం అకాశంలో నిలబెడుతున్నదని ఆరోపించారు. పేద ప్రజలపై భారాలు మోపి కార్పోరేట్‌లకు రాయితీలు ప్రకటిస్తున్నదని ఐదేళ్ళలో కార్పోరేట్లకు పది లక్షల కోట్లను మాఫీ చేసిందని అతి తక్కువ కాలంలో అదాని, అంబానీలు లక్షల కోట్ల సంపదకు అధిపతులయ్యారంటే మోదీ ప్రభుత్వ స్వభావాన్ని అర్థం చేసుకోవచ్చునని సూచించారు. పెంచిన పెట్రోల్, డిజీల్, వంట గ్యాస్‌ల ధరలను తగ్గించాలని, వంట నూనెలు, గోదుమలు, పాలు, చక్కర, బెల్లం, పెరుగు తదితర వస్తువులపై 5 శాతం జిఎస్టీ వేయడం సిగ్గుచేటని నిశితంగా విమర్శించారు. ఈ ధర్నాలో ప్రదీప్, రాము, ప్రవీణ్, కిరణ్, స్వరూప్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళపైకి దూసుకెళ్లిన కారు.. అక్కడికక్కడే మృతి
నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

పేట్‌బషీరాబాద్, ఆగష్టు 29 ప్రభాతవార్త: రోడ్డు పక్కన మక్కబుట్టలు అమ్ముకుంటున్న మహిళను వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఆదివారం సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కొంపల్లి మున్సిపాలిటీ పరిధి బహదూర్‌పల్లి క్రాస్ రోడ్డు ఎన్టీఆర్ విగ్రహం వద్ద చిట్టెమ్మ(55) మొక్కజొన్న కంకులు అమ్ముంటూ జీవనం సాగించేది. ఈనెల28 ఆదివారం రాత్రి సమయంలో దూలపల్లి నుంచి బహదూర్‌పల్లి వెళ్తున్న (టీఎస్09ఎఫ్‌హెచ్‌టీ/ఆర్6218) బ్రీజాకారు రోడ్డు పక్కన మొక్కజొన్న కంకులు అమ్ముతున్న చిట్టెమ్మపైకి దూసుకెళ్లింది. దీంతో తీవ్రగాయాలైన చిట్టెమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి కుమారుడు సంజయ్‌కుమార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ దర్యాప్తులో నిందితుడిని దూలపల్లి ప్రభుత్వ పాఠశాల సమీపంలో నివాసం ఉంటున్న ఆటోడ్రైవర్ పారుపల్లి అజయ్‌కుమార్(30)గా గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

గాఢ నిద్రలో ఉండగా హత్య

హైదరాబాద్ ఆగస్టు 29 ప్రభాతవార్త : గాఢ నిద్రలో ఉన్న ఓ వ్యక్తిని గుర్తు తెలియని ఆగంతకుడు రాడ్డుతో తలపై బలంగా మోది హత్యచేసిన ఘటన బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో కలకలం సృష్టించింది. ఇన్‌స్పెక్టర్ రవి కుమార్, ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం నేపాల్‌కు చెందిన బహదూర్ (50) గత కొంత కాలంగా షేక్ షాహీన్‌తో కలిసి న్యూ బోయిన్‌పల్లి ఓల్డ్ ఎయిర్‌పోర్టు రోడ్డులోని వివిధ కాలనీల్లో భిక్షాటన చేసుకుంటూ ఫుట్‌పాత్‌పై ఉంటున్నారు. ఈ నెల 28న రాత్రి భిక్షాటన అనంతరం భోజనం చేసుకున్న బహదూర్ ఓల్డ్ ఎయిర్‌పోర్టు రోడ్డులోని సంచార్‌పురి కాలనీ ఫేజ్-2లోని ప్లాట్ నెంబర్ 4లో ఉన్న గ్లోబల్ ప్యాకేజింగ్ సొల్యూషన్స్ సంస్థ వద్ద నిద్ర పోయాడు. ఇదే అదునుగా తీసుకున్న గుర్తు తెలియని ఆగంతకుడు రాత్రి 11.30 గంటల ప్రాంతంలో నిద్ర పోతున్న బహదూర్ వద్దకు వచ్చి తన వద్దనున్న రాడ్డుతో బహదూర్ తలపై ఏడు సార్లు బలంగా మోది హత్య చేసి పరారయ్యాడు. సోమవారం ఉదయం ఫుట్‌పాత్‌పై ఓ వ్యక్తి రక్తపు మడుగుల్లో మృతి చెంది పడి ఉన్నాడని సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితులను పరిశీలించారు. అయితే 28వ తేదీన రాత్రి న్యూ బోయిన్‌పల్లి చిన్న తోకట్ట ప్రాంతానికి చెందిన నాదుల్ (35), బహదూర్‌లకు నడుమ గొడవ జరిగిందని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. అదే అక్కసుతో నాదుల్ ..బహదూర్‌ను హత్యచేసి ఉంటాడని భావిస్తున్నట్లు సిఐ తెలిపారు. క్లూస్ టీం పోలీసులు ఘటనా స్థలంలో పలు ఆధారాలను సేకరించారు. మృతదేహాన్నిపోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రి మార్చురికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని సిసి పుటేజీల ఆధారంగా నిందితుడి కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేశారు.

****

మండప నిర్వాహకులు విధిగా నిబంధనలు పాటించాలి
మాదాపూర్ డిసిపి కె. శిల్పవల్లి

నార్సింగి, ఆగస్టు 29 ప్రభాతవార్త : వినాయక మండప నిర్వాహకులంతా విధిగా నిబంధనలు పాటించి, శాంతియుత వాతావరణంలో గణపతి పూజలు చేసుకోవాలని మాదాపూర్ డీసీపీ కె.శిల్పవల్లి పేర్కొన్నారు. సోమవారం నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలోని రాయల్ ఫంక్షన్‌హాల్‌లో వినాయక మండప నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేసి, నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి డీసీపీ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ ప్రతీ మండపం వద్ద తప్పకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, బాణాసంచా వంటి పేలుడు పదార్థాలు పెట్టవద్దని సూచించారు. మండపాల పేరుతో పర్మనెంట్ షెడ్లు వేయవద్దని, అనుకోని సంఘటనలతో అగ్ని ప్రమాదాలు జరిగితే నివారించేందుకు గాను ఇసుక, నీటిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. నాణ్యమైన విద్యుత్ వైర్లను వాడాలని, రాజకీయాలకు తావివ్వకుండా భక్తిభావంతోనే పూజలు చేసుకోవాలని సూచించారు. మండపాల వద్ద మద్యం సేవించవద్దని, ఇతర చట్ట విరుద్ధమైన పనులు చేయవద్దన్నారు. 24.గంటలు కనీసం ముగ్గురు వ్యక్తులు గణపతి మండపాల వద్ద ఉండేలా చూసుకోవాలని, పోలీసుల సూచనలు తప్పకుండా పాటించాలన్నారు. అనుమానాస్పదమైన వస్తువులుగాని కనిపిస్తే వెంటనే 100గాని స్థానిక పోలీసులకు గాని సమాచారం ఇవ్వాలని డీసీపీ శిల్పవల్లి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ రఘునందన్‌రావ్, ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సోమవారం నగరంలో కొన్ని ప్రాంతాల్లో వర్షం కురిసింది. ఎఎస్‌రావు నగర్‌లో రోడ్డుపై పారుతున్న వర్షపు నీళ్లు

డెంగ్యూ క్యూ..!

- ఆస్పత్రులు హౌస్‌ఫుల్
- నగరాన్ని వణికిస్తున్న విషజ్వరాలు
- ఒకరు చేరాలంటే మరొకరిని డిశ్చార్జ్ చేయాల్సిందే
- బాధితుల్లో 50 శాతం మంది 14 ఏళ్లలోపు పిల్లలే

రోగులకు అవసరం లేకున్న ప్లేట్‌లెట్లు ఎక్కిస్తున్న వైనం..

కొన్నాళ్ళ క్రితం వరకు కరోనా బాధితులను పీల్చి పిప్పి చేసిన అనేక ప్రైవేటు ఆసుపత్రులు.. ఇప్పుడు డెంగీ రోగుల జేబులు గుల్ల చేస్తున్నాయి. తప్పుడు రిపోర్టుల్లో ప్లేట్‌లెట్ల సంఖ్యను తక్కువగా చూపిస్తున్నాయి. ప్లేట్‌లెట్లు అవసరం లేకపోయినా ఎక్కిస్తూ డబ్బులు గుంజుతున్నాయి. ప్రైవేటు ఆసుపత్రుల్లో అనవసరంగా ఫీజులు వసూలు చేయొద్దని వైద్య ఆరోగ్యశాఖ పదేపదే చెబుతున్నా కొన్ని ఆసుపత్రులు ఏమాత్రం పట్టించుకోవడంలేదు. రూ.50 వేల నుంచి రూ.2లక్షల వరకు వసూలు చేస్తూ రోగుల్ని ఇబ్బందుల పాలు చేస్తున్నాయి. ప్రైవేటు ఆసుపత్రులు అధిక ఫీజులు వసూలు చేస్తే తమకు ఫిర్యాదు చేయాలని కోరుతూ ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ శ్రీనివాస్‌రావు ప్రత్యేకంగా ఇచ్చిన వాట్సప్ నెంబర్ 9154170960కు పలు ఫిర్యాదులు వస్తున్నాయని ఒక అధికారి తెలిపారు. రోగికి 50 వేలకు పైగా ప్లేట్‌లెట్లు ఉన్నా ఐసీయూలో ఉంచి అదనంగా ప్లేట్‌లెట్లు ఎక్కిస్తున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. నాలుగైదు రోజులు ఉంచుకొని భారీ ఎత్తున బిల్లులు వేసి వసూలు చేస్తున్నట్టుగా ఫిర్యాదులు అందుతున్నాయి. డెంగీ లేకపోయినా ప్లేట్‌లెట్ల కౌంట్ సరిపడా ఉన్నప్పటికీ ప్రజలకు భయభ్రాంతులకు గురి చేస్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

హైదరాబాద్, ఆగస్టు 29 ప్రభాతవార్త : డెంగీ ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. నగరంలో కొంత కాలంగా డెంగీ పాజిటివ్ కేసుల సంఖ్య అధికమవుతోంది. దోమల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి ఆదివారం పరిసరాలు పరి శుభ్రంగా ఉంచుకునేలా ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నామని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఆందోళన కరంగా మారుతున్నాయి. అడుగడుగునా చెత్తకుప్పలు, డ్రైనేజీ మురుగుతో రోడ్లు కంపు కొట్టడానికి తోడు ఎడతెరిపిలేని వర్షాలతో దోమలు, ఈగలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో జనానికి కంటిమీద కునుకు కరువవుతోంది. జ్వరం రాగానే కరోనా పరీక్షలతో పాటు డెంగీ, మలేరియా, టైఫాయిడ్ పరీక్షలన్నీ చేయించుకుంటున్నారు. అయితే మూడేళ్ళ తర్వాత ఈసారి డెంగీ కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయని వైద్య వర్గాలు వెల్లడించాయి. డెంగీ దోమలు పసిపిల్లలపై పంజా విసురుతున్నాయి. తీవ్రమైన జ్వరం, జలుబుతో బాధపడుతూ ఆస్పత్రులకు చేరుతున్న చిన్నారుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. నిలోఫర్ ప్రభుత్వ నవజాత శిశువుల ఆరోగ్య కేంద్రం సహా నగరంలోని పలు ప్రైవేటు చిన్నపిల్లల ఆస్పత్రులు సైతం జ్వర బాధితులతో కిక్కిరిసిపోతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లోని పీడియాట్రిక్ విభాగాలన్నీ హౌస్‌ఫుల్ కావడంతో పడకల కోసం పడిగాపులు కాయాల్సి వస్తోంది. వైద్యం అటుంచి.. కనీసం పడుకునేందుకు బెడ్ దొరికితే చాలు అన్నట్లుగా ఉంది. గ్రేటర్‌లో గత పది రోజుల్లో 1767 కేసులు నమోదు కాగా, బాధితుల్లో 50 శాతం మంది 14 ఏళ్లలోపు పిల్లలే కావడం గమనార్హం. జ్వరపీడితుల్లో నిలోఫర్, గాంధీ పీడియాట్రిక్ వార్డులు పూర్తిగా నిండిపోయాయి. ఇక నిలోఫర్ ఆస్పత్రిలో ఒకే బెడ్‌పై ఇద్దరు పిల్లలను ఉంచి చికిత్స అందిస్తున్నారు. దీంతో చిన్నారుల తల్లిదండ్రులు విధిలేని పరిస్థితుల్లో ప్రైవేటు ఆస్పత్రులు, క్లీనిక్స్‌లను ఆశ్రయిస్తున్నారు. తీరా అక్కడ కూడా చేదు అనుభవమే ఎదురవుతోంది. రోజురోజుకు పెరుగుతున్న రోగుల రద్దీ దృష్ట్యా జ్వరం పూర్తిగా తగ్గకుండానే బాధితులను ఆస్పత్రి నుంచి డిశ్చార్జీ చేసి కొత్తవారిని అడ్మిట్ చేసుకోవాల్సి వస్తుందని ప్రైవేటు వైద్యులు పేర్కొంటున్నారు. ఇక ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో నమోదవుతున్న డెంగీ కేసులు వివరాలు గోప్యంగా ఉంచుతుండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

టెస్టుల పేరుతో ఫీజుల దోపిడి..

జనాల్లో డెంగీ భయం పెరగడంతో ఇదే అదనుగా ప్రైవేటు ఆస్పత్రుల్లో దోపిడికి తెగబడ్డాయి. ప్రస్తుత కరోనా పరిస్థితుల్లో సాధారణ జ్వరం వచ్చినా జనం భయపడిపోతున్నారు. మూడు రోజులకు మించి ఫీవర్ తగ్గకపోతే వెంటనే ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు.దీంతో ఇదే అదునుగా ప్రైవేటు హాస్పిటల్స్ దోపిడీకి తెరలేపుతున్నాయి. నార్మల్ ఫీవర్‌తో వెళ్లినా లేనిపోని టెస్టులు చేసి ప్లేట్‌లెట్స్ తగ్గాయని, ఆలస్యం చేస్తే పరిస్థితి సీరియస్ అవుతుందని భయపెడుతున్నారు. కొన్ని ఆస్పత్రుల్లో ప్లేట్‌లెట్స్ కౌంట్ లక్ష కంటే ఏమాత్రం తగ్గినా ప్లేట్‌లెట్ రెడీ చేసుకోవాలని సూచిస్తుండడంతో రోగుల బంధువుల్లో టెన్షన్ మొదలవుతోంది. ఈ వ్యాధులకు ప్రమాదన కారణం దోమలు అని తెలిసి వాటిని పూర్తిగా నివారించి ప్రజలకు రక్షణ కల్పించాల్సిన అధికారులు నామమాత్రపు చర్యలు చేపడుతూ చేతులు దులుపుకుంటున్నారు. విషజ్వరాలు డెంగ్యూ బారినపడుతున్నది ఎక్కువగా మురికివాడలకు చెందిన పిల్లలే కావడంతో వారిలో పేద వారు ప్రభుత్వ ఆసుపత్రులకు ఆశ్రయిస్తుండగా, కొద్దిగా స్తోమత ఉన్నవారు ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నరు. విష జ్వరాలో అంత పెద్ద ప్రమాదం లేనప్పటికీ డెంగ్యూతో పెద్ద ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఎక్కువ మంది డెంగీ షాక్ సిండ్రోమ్‌తో చేరుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. శరీరంలో ప్లేట్‌లెట్లు తగ్గిపోయి..రక్తస్రావం అవుతున్న క్రమంలో ఆసుపత్రికి వస్తున్నారు. కొందరిలో పరిస్థితి విషమంగా మారుతోందని అంటున్నారు. ముందే మేలుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

బాధితుల్లో చిన్నపిల్లలే ఎక్కువ..

పెద్దలతో పోలిస్తే చిన్నపిల్లల్లో రోగ నిరోధకక్తి తక్కువగా ఉంటుంది. సీజన్ మారి నప్పుడు పలువురు చిన్నారులు జ్వరం, దగ్గు, జలుబు, నిమోనియాతో బాధపడుతుంటారు. డెంగీ దోమలు ఎక్కువగా పగటిపూట కుడుతుంటాయి. మూడేళ్లలోపు చిన్న పిల్లలు ఎక్కువగా పగటిపూట నిద్రపోతుంటారు. కాళ్లు, చేతులు పూర్తిగా కవర్‌చేసే దుస్తులకు బదులు ఆఫ్‌షర్ట్స్, షార్ట్స్ ధరిస్తుంటారు. వీరిని దోమలు కుట్ట డంతో త్వరగా డెంగీ బారిన పడుతుంటారు. ఇక స్కూ లు పరిసరాల్లో పారిశుధ్య లోపంతో విద్యార్థులకు జ్వరాలు వస్తున్నాయి. డెంగ్యూ జ్వరం 'ఏడిస్ ఈజిప్ట్' అనే ఆడ దోమ పగటి పూట నొప్పిరాకుండా కుట్టడం వల్ల వస్తుం దని, నియో బీబిసి చిల్డ్రన్ ఆస్పత్రి ఎండి, ప్రముఖ పిల్లల వైద్యనిపుణులు డాక్టర్ మంజుకొండ రంగయ్య పేర్కొన్నారు. డెంగ్యూ బారిన పడకుండా పిల్లలకు పూర్తి రక్షణ కల్పించాలని ప్రతి ఇంటిలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. డెంగ్యూ వ్యాధికి కారణం, వ్యాధి రాకుండా తీసుకునే జాగ్రత్తలను ఆయన వివరించారు.2002లో మొదటిసారిగా డెంగ్యూతో ఎంతో మంది మృత్యువాతపడ్డారని తెలిపారు. డెంగ్యూ జ్వరం రావడానికి దోమ కాటు నుంచి ఐదు నుంచి ఎనిమిది రోజుల సమయం పట్టవచ్చని తెలిపారు.

వేబ్రిడ్జి మోసాలు

మోసాలని ఎలా గుర్తించాలి..

వేబ్రిడ్జి పై ఇనుము, ఇసుక తదితర వాటిని తూకం వేసే ముందు కాంటా ఇండికేటర్ జీరో రీడింగ్ ఉండేలా చూడాలి. లోడ్‌లారీని తూకం వేసి రశీదు పరిశీలించాలి.ఉదాహరణకు లారీలోడ్ 14టన్నులు ఉండే వేబ్రిడ్జ్‌లో 50కిలోల 20 సెట్టింగ్(గుండ్లు) అంటే ఒక టన్ను బరువు లారీలోడ్ ఉన్న ప్లాంట్ ఫారమ్‌పై ఉంచి మరోమారు తూకం బరువు 15టన్నులు మాత్రమే ఉండాలి. కానీ లోడ్‌బరువులో హెచ్చుతగ్గులు ఉంటే మోసానికి హెచ్చరికగా గ్రహించాలి. దానిని మరో వేబ్రిడ్జ్‌లో తూకం వేసి పరిశీలిస్తే మోసం, దోపిడీ బహిర్గతమవుతుంది.

- లోడ్ తక్కువ.. చూపించేది ఎక్కువ
- ఇసుక లారీల యజమానులతో నిర్వాహకుల కుమ్మక్కు
- తప్పుడు బిల్లులతో వినియోగదారులకు కుచ్చుటోపీ
- పట్టించుకోని తూనికలు, కొలతల శాఖ అధికారులు

హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త: నగరంలో వేబ్రిడ్జ్ నిర్వాహకుల దోపిడీకి అడ్డూ అదుపు లేకుండా పోతుంది. నిర్వాహకులే చేతివాటం ప్రదర్శించి తప్పుడుతూకాలతో వ్యాపారులను, వినియోగదారులు మోసం చేస్తున్నారు. వేబ్రిడ్జీలను పర్యవేక్షించాల్సిన తూనికల, కొలతల శాఖ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతుండటంతో వేబ్రిడ్జిల నిర్వాహకులు చేతివాటానికి అడ్డూ అదుపు లేకుండా పోతుంది. గృహనిర్మాణ పనులు జోరుగా సాగుతుండటంతో ఇసుక వ్యాపారం బాగా పెరిగిపోయింది. దీంతో ఇసుక వ్యాపారులు వేబ్రిడ్జ్ నిర్వాహకులు కుమ్మక్కై వినియోగదాలును మోసం చేస్తున్నారు. తప్పుడు బిల్లులతో మోసం చేస్తున్నారు. హైదరాబాద్ శివారు ప్రాంతాలలోని హైదరాబాద్-విజయవాడ నాగ్‌పూర్ వరంగల్, బెంగళూర్ ప్రధాన జాతీయ రహదారి వెంట ఉన్న వేబ్రిడ్జ్‌ల్లో ఈ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఆయా రహదారుల వెంట నిత్యం వందల కొద్ది ఇసుక, ఇనుము, లోడ్లు రవాణా జరుగుతోంది. వేబ్రిడ్జ్ నిర్వాహకులతో సంబంధాలు పెట్టుకున్న వ్యాపారులు తప్పుడు తూకం బిల్లుతో మోసాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నగర శివార్లలో దాదాపు 150కి పైగా వేబ్రిడ్జిలు ఉన్నాయి. గృహ నిర్మాణాలు ఊపందుకోవడంతో నిత్యం టన్నుల కొద్ది ఇసుక,ఇనుము,క్రయ విక్రయాలు జరుగుతున్నాయి. వ్యాపారులు సరుకును లారీలో లోడ్‌చేసి ప్రధాన రహదారులపై ఉన్న వేబ్రిడ్జ్‌లపై తూకం వేయిస్తుంటారు.అయితే వ్యాపారులు వేబ్రిడ్జ్‌ప నిర్వాహకులతో ఒప్పందాలు కుదుర్చుకోవడంతో ఇండెక్షన్ బాక్స్‌లో ప్రదర్శించిన చేతివాటంతో కంప్యూటర్ బిల్లు లోడ్ బరువు తప్పుగా చూపిస్తుంది. ఇందుకు గాను వ్యాపారుల నుంచి కమీషన్‌రూపంలో కొంత అదనంగా వసూలు చేస్తుండటం సర్వసాధారణంగా మారింది. 12టైర్ల లారీ బరువు సుమారు పది టన్నులు వరకు ఉంటుంది. అందులో 21టన్నుల వరకు ఇసుక లోడ్ చేయవచ్చు. ఇసుకలోడ్ తూకం వేస్తే31 టన్నులు బరువు చూపించాలి. అదేవిధంగా 10టైర్ల లారీ బరువు సుమారు తొమ్మిది టన్నులు ఉంటుంది. అందులో 17టన్నుల వరకు ఇసుకను లోడ్‌చేయవచ్చు.తూకం వేస్తే 26టన్నులు ఉండాలి. అయితే ఈలారీలో ఇసుక తక్కువగా లోడ్ చేసినా వినియోగదారులు గుర్తించడం కష్టం. ఇసుకవ్యాపారులు చేతివాటం ఒక్కోలారి ఐరు టన్నుల వరకు తక్కువగా లోడ్‌అవుతుంది.వేబ్రిడ్జ్ నిర్వాహకుల చేతివాటంతో లేని ఐదుటన్నులు ఇసుక ఉన్నట్లుగా కంప్యూటర్ బిల్లింగ్ ద్వారా వస్తుండటంతో వినివయోగదారులు మోసపోతున్నారు.

గణేష్ మండపాల వద్ద పాటించాల్సిన విద్యుత్ జాగ్రత్తలు

హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త: మండపాలకు విద్యుత్ సరఫరా కనెక్షన్ కోసం సామాన్యులు విద్యుత్ స్థంభాలు ఎక్కరాదు. సంస్థ సిబ్బంది ద్వారానే విద్యుత్ కనెక్షన్ పొందాలి. మండపంలో గల విద్యుత్ పరికరాల లోడ్‌కు తగిన నాణ్యమైన కేబుల్స్‌ను వాడాలి. జాయింట్లు ఉన్న ఇన్సులేషన్ లేని వైర్లను వాడటం ఆపాయకరం. మండపాలకు తగ్గ కెపాసిటీ కలిగిన ఎంసిబి (మినియేచర్ సర్క్యూట్ బ్రేకర్)లను తప్పనిసరిగా వాడాలి. ఒకేళ ఎంసిబిలు ఓవర్‌లోడ్ అయితే షార్ట్ సర్క్యూట్ అయ్యి, అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. విద్యుత్ సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గణేష్ మండపాలను ఏర్పాటు చేయరాదు. మండపాల్లో విద్యుత్ సంబంధిత పనులు చేసేటప్పుడు పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించాలి. విద్యుత్ పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్ల దిమ్మెలను మండపాలకు సపోర్టు కోసం వాడరాదు. విద్యుత్ వైర్లు, పోల్స్ ఇతర ప్రమాదకర పరికరాల నుంచి పిల్లల్ని దూరంగా ఉంచాలి. ఒక వేళ ఎవరికైనా విద్యుత్‌షాక్ తగిలితే వారికి వెంటనే వైద్యసహాయం అందించి ,ఆప్రమాదం గురించి దగ్గరలోని విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలి. విద్యుత్ లైన్స్ ఎక్కడైనా తెగిపడ్డా, ఇతర అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు వెంటనే 1912/100 సమీపప్యూజ్ ఆఫ్ కాల్‌కు కాల్‌చేసి విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలి.

గణేష్ మండపాల వద్ద విద్యుత్ భద్రత పాటించాలి: టిఎస్ఎస్‌పిడిసిఎల్ సిఎండీ రఘుమారెడ్డి

వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే మండపాల వద్ద విద్యుత్ భద్రత, నిరంతరాయ విద్యుత్ సరఫరా కోసం విద్యుత్‌శాఖ చేపట్టిన పనులను సిఎండీ రఘుమారెడ్డి సోమవారం టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈసమీక్షా సమావేశంలో సంస్థ ఆపరేషన్ డైరెక్టర్ జె.శ్రీనివాస్‌రెడ్డి, ఛీఫ్ జనరల్ మేనేజర్లు, సూపరింటెండెంట్ ఇంజనీర్లు పాల్గొన్నారు. మండపాలకు నిరంతర విద్యుత్ సరఫరా, భద్రతాకోసం తమ సంస్థ ఏర్పాట్లు చేసిందన్నారు. సామాన్య ప్రజలు, భక్తులు, మండప నిర్వాహకులు, మండపాల వద్ద విద్యుత్ భద్రతా చర్యలు పాటించాలని కోరారు.

పలు రంగాల్లో ప్రతిభా మూర్తులకు
తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారాల ప్రదానం

నాంపల్లి, ఆగస్టు 29 ప్రభాతవార్త : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రతీయేటా వివిధరంగాల్లో విశేషకృషిచేసిన ప్రతిభామూర్తులను విశ్వవిద్యాలయ ప్రతిష్టాత్మక ప్రతిభా పుర స్కారాలతో సత్కరిస్తున్నట్లు, ఇందులో భాగంగా 2019 సంవత్సరానికిగాను విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారాలను వివిధ ప్రక్రియల్లో ప్రకటించినట్లు రిజిస్ట్రార్ ఆచార్య భట్టురమేష్ తెలిపారు. కవితారంగంలో వి.ఆర్.విద్యార్థి, విమర్శలో ప్రొఫెసర్ పి.సుబ్బాచారి, చిత్రలేఖనంలో ఎం.బాలరాజ్, శిల్పంలో ఎస్.కాంతారెడ్డి, నృత్యంలో ఎస్.సువర్ణలత, సంగీతంలో డి.వి.మోహనకృష్ణ, పత్రికారంగంలో వి.మురళి, నాటకంలో మల్లాది గోపాలకృష్ణ, జానపదకళా రంగంలో ఎం.భిక్షపతి, అవధానంలో ఎం.గౌరీశంకరశర్మ, ఉత్తమ రచయిత్రిగా డా. పరిమళ సోమేశ్వర్, నవల/కథ వి.అశ్వనీకుమార్‌లను ప్రతిభా పురస్కారాలకు ఎంపికైనట్లు ఆయన వివరించారు.

ఖైరతాబాద్ మహాగణపతి సర్వం సిద్ధం..
- చవితికి ప్రముఖుల పూజలు

ఖైరతాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్రం, రాజధాని నగరంలో కొలువుదీరిన ఖైరతాబాద్ మహాగణపతి సర్వం సిద్ధంఅయ్యాడు. చవితిరోజున ప్రముఖులు,వివిపిలు, మంత్రులు, ప్రజాప్రతినిధులు, పలు కేంద్ర, రాష్ట్ర సంస్థల అధికారులు మహాగణపతికి ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఈ యేడు శ్రీ పంచముఖ మహాలక్ష్మిగణపతిగా అశేష భక్తజనానికి దర్శనమివ్వనున్నాడు. 68 సంవత్సరాలు అయినందున ఈ సారి ఘనంగా పూజలందుకోనున్నారు. 50 అడుగుల ఎత్తుతో, మట్టితో అన్ని విధాలుగా పర్యావరణాన్ని చాటుతూ సహజరంగులతో కొలువుదీరి అశేష జనవాహిణి పూజలందుకోనున్నారు. ప్రతి యేట ఆనవాయితీగానే పద్మశాలి సంఘంవారు మహాగణపతికి పట్టుకండువా, జంజరం, తదితర వంటివి సమర్పిస్తున్నారు. మరోవైపు ఖైరతాబాద్ గణేష్ ఉత్సవకమిటీ నిర్వాహక బృందం, గణపతికి రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన పూజలు గావించి దర్శించుకునే భక్తులకు యధావిధిగా అన్ని సౌకర్యాలను కల్పించనుంది. ఇదిలా ఉండగా, ప్రత్యేక పేరుగాంచిన ఖైరతాబాద్ మహాగణపతి పరిసర ప్రాంతాలలో అవసరమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసింది. నగర పోలీసు కమిషనర్ ఆదేశాలనుసారం సెంట్రల్ జోన్ డిసిపి నేతృత్వంలో ఎసిసి,సిఐలు ఇప్పటికే భద్రతా చర్యల పట్ల సమావేశం కూడా నిర్వహించింది. ఏది ఏమైనా గణేష్ ఉత్సవాలు ఎలాంటి ఆటంకాలే లేకుండా శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని పోలీసుఅధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ శాఖలకు చెందిన బల్దియా, వాటర్‌వర్క్స్, ఆర్‌అండ్‌బి, విద్యుత్, తదితర వంటి సంస్థలు ఎవరి పనిలో వారు నిమగ్నమై ఉన్నారు.

వినాయక నవరాత్రోత్సవాలను ప్రశాంతగా జరుపుకోవాలి

సైఫాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త : వినాయకచవితి నవరాత్రోత్సవాలు ప్రజలు భక్తిశ్రద్ధలతో ఆనందంగా ప్రశాంతంగా జరుపుకోవాలని లోక్‌దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటరాజేశ్వరరావు భక్తులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం నాడిక్కడ పార్టీ కార్యాలయంలో మట్టి వినాయక బొమ్మలను ఉచితంగా పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. శాంతి యుతంగా నవరాత్రోత్సవాలను జరుపుకోవాలని, పోలీసులకు ప్రజలు పూర్తిగా సహకరించాలని, ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని ఆయన కోరారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకుడి విగ్రహాలు మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రాము, యాదయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వీరశైవ లింగాయత్ లింగ బలిజలను ఓబీసీ జాబితాలో చేర్చాలి
- ఎంపి ఆర్.కృష్ణయ్య

చిక్కడపల్లి, ఆగస్టు 29, ప్రభాతవార్త : కేంద్ర ప్రభుత్వం బీసీలను చిన్నచూపు చూస్తే సహించేది లేదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. రాష్ట్రంలో బీసీ జాబితాలో ఉన్న వీరశైవ లింగాయత్ లింగ బలిజ సామాజికవర్గాన్ని కేంద్ర ప్రభుత్వం ఓబీసీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం యువజన విభాగం ఆధ్వర్యంలో ఎస్ఎస్‌సిలో ప్రతిభకనబర్చిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బీసీలు రాజ్యాధికారం సాధించడానికి కొనసాగించే ఉద్యమంలో వీరశైవ లంగాయత్‌లు ముందు వరుసలో ఉండాలని అన్నారు. వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం అధ్యక్షుడు చెన్న ఈశ్వరప్ప మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం లింగాయత్‌లకు రూ.1000కోట్ల నిధులతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేయాలని అన్నారు. లింగాయత్‌ల సంక్షేమ భవనం నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించి రూ.20కోట్లు మంజూరు చేయాలని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహా ప్రతిభా పురస్కారాలను అందించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పట్లోళ్ళ సంగమేశ్వర్, మాజీ ఉపలోకాయుక్తా, సెంట్రల్ కమిటీ చైర్మన్ ఎం.శివరత్న, ప్రధాన కార్యదర్శి శివకుమార్, నాయకులు దినేష్ పాటిల్, శివచరణ్, కల్లేపల్లి రాచప్ప, కెఎస్.లక్ష్మి, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అభివాదం చేస్తున్న నాయకులు

టిఆర్ఎస్ ఎంఐఎం కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయి
- హిందూ వాహిని తెలంగాణ సంయోజక్ ఉప్పలరాజు

హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఒకవర్గాన్ని సంతృప్తి పరిచేందుకు మాత్రమే పనిచేస్తున్నట్లుగా తెలంగాణ ప్రజలకు అనిపిస్తుందని మోజార్టీ ప్రజల మనోభావాలు ,వారి ఆశయ ఆకాంక్షలకు విరుద్దంగా వ్యవహరిస్తుందని హిందూవాహిని తెలంగాణ సంయోజకులు ఉప్పల రాజు అన్నారు.ఈమేరకు సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో న్యాయవాది రాజవర్ధన్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమ యజ్ఞం నుంచి ఏర్పడిన తెలంగాణను సిఎం కెసిఆర్ తన స్వార్థ, కుటుంబ అవినీతి పాలనతో ఉద్యమకారులు, ఉద్యమానికి వెన్నుగా ఉన్న ఇక్కడి హిందు సమాజానికి ద్రోహం చేసి తెలంగాణ ఉద్యమాన్ని వ్యతిరేకించిన ఎంఐఎం పార్టీతో జతకట్టాడన్నారు. ఎంఐఎంతో కుమ్మకై రాజాసింగ్‌పై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. చట్టం ఉల్లఘిస్తే కోర్టులో రుజువు చేసి శిక్షించాలని కానీ విచారణ అవకాశం లేని, దీర్ఘకాలంగా జైల్లో ఉండగలిగే పిడియాక్ట్ చట్టం ఉపయోగించడం హేమమైన చర్య అన్నారు. ఇది వ్యక్తి ప్రాథమిక హక్కులకు విరుద్ధమన్నారు. ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ మీద 10కిపైగా క్రిమినల్ కేసులు పెండింగ్‌లో విచారణలో ఉనాయని మరి ఆయనపై ఎందుకు పిడియాక్ట్ ప్రయోగించలేదన్నారు. అలాగే వివాదాస్పద హాస్య కళాకారుడు మునావర్ ఫారుఖ్‌ను దేశంలో చాలా రాష్ట్రాలు నిషేదించాయని అలాంటి వారిని కెటిఆర్ ఆహ్వానించడం, 2వేల మంది పోలీసు బందోబస్తులో కార్యక్రమాన్ని జరపడం దానికోసం సుమారు వెయ్యిమందికిపైగా హిందూ సంస్థల కార్యకర్తలను నిర్భందానికి గురి చేయడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. కావున రాష్ట్ర ప్రభుత్వం తన తీరును మార్చుకోకపోతే ప్రజల ఆగ్రహానికి గురికాకతప్పదని హెచ్చరించారు.

డాక్టర్లు మానవ సమాజ రక్షకులు డాక్టర్లు : జస్టిస్ జి.చంద్రయ్య

రవీంద్రభారతి, ఆగస్టు 29, ప్రభాతవార్త : వృత్తిరీత్యా అనారోగ్యంతో బాధపడుతున్న వారికి చేసే సేవకు మించిన మరో సేవంటూ ఈ ప్రపంచంలో మరొక టి ఏదీలేదని, మానవ సమాజ రక్షకులను డాక్టర్ల ను ఎన్నిసార్లు సత్కరించుకున్నా, అభినందించుకు న్నా తక్కువేనన్న తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్ జస్టిస్ జి.చంద్రయ్య ఏ వ్యక్తికైతే సేవా ప్రేమపై సమగ్ర అవగాహన ఉం టుందో వాళ్లకి భావాలకు, వ్యక్తిగతానికి కొదువ ఉండదని, సేవకుమించిన తృప్తి కలుగదు, ఉండ దని, అలాంటి కోవకు చెందిన సేవామూర్తి మదర్ థెరిసా అని, ఆమె జీవితాన్ని, సేవలను స్ఫూర్తిగా తీసుకొని సమాజానికి సేవలందించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ రోజు మదర్ థెరిసా సేవా పుర స్కారాలు అందుకున్న డాక్టర్లను ఆయన ఎంతగానో అభినందించారు. మదర్ ఫౌండేషన్, నవకళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో భారతరత్న మదర్ థెరిసా 112వ జయంతి వేడుకలను పురస్కరించుకొని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అంకెనపల్లి మల్లికార్జునరావు నిర్వహణలో సరస్వతి ఉపాసకుడు దైవజ్ఞశర్మ సభాధ్యక్షతన జరిగిన సేవారత్న పురస్కారాల ప్రదానోత్సవ కార్య క్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్ జస్టిస్ జి.చంద్రయ్య విశిష్ట అతిథులు కె.శ్రీనివాసచారి, డా. ఆషిస్ చౌహాన్, డా. ఎ.భరత్ ప్రకాష్, సంస్థ నిర్వాహక కార్యదర్శులు రాఘవ, సాయినాథ్, ఆర్.సాయికుమార్ తదితరులతో కలిసి న్యాయవాద, వైద్యరంగంలో ఉంటూ సమాజంలో అనారోగ్యానికి గురైన ఎంతోమందికి అత్యుత్తమ సేవలందిస్తూ వారి ప్రాణాలను, తద్వారా వారి కుటుంబాలను కాపాడుతున్న సుమారు 30మంది ప్రముఖ న్యాయవాదులు, డాక్టర్లను వారి సేవలకు గుర్తింపుగా ఘనంగా సత్కరించి వారి సేవలను కొనియాడుతూ సేవారత్న పురస్కారాలను ప్రదానం చేసి ఎంతగానో అభినందించారు.

పురస్కారగ్రహీతలతో జస్టిస్ జి.చంద్రయ్య

పాఠకులకు సాహిత్య కానుక 'తరతరాల తెలుగు' గ్రంథాలు
- తెలుగు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్‌రావు

నాంపల్లి, ఆగస్టు 29, ప్రభాతవార్త : ప్రముఖ రచయిత చీకోలు సుందరయ్య రచించిన 'తరతరాల తెలుగు-విశేషాంశాలు, తరతరాల తెలుగు-సాహిత్యాంశాలు' గ్రంథాలు ఔత్సాహిక పాఠకులకు అందించిన సాహిత్య కానుక అని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య తండెగ కిషన్‌రావు సోమవారం సాయంత్రం విశ్వవిద్యాలయంలోని సమావేశ మందిరంలో శ్రీ మాసన ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ సభాధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆత్మీయ అతిథులు బి.రామచంద్రరావు, రఘుశ్రీ, ఎం.వెంకటరమణ తదితరులతో కలిసి ఆ రెండు గ్రంథాలను ఆవిష్కరించి ప్రసంగిస్తూ చీకోలు సుందరయ్య వెలువరించిన ఈ సాహిత్య గ్రంథాలను ఎందరికో స్ఫూర్తిప్రదాత, సంస్కార సంపన్న ప్రతిభామూర్తి, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా. కె.వి.రమణాచారికి అంకితమివ్వడం ఔచిత్యం, ఆనందదాయకంగా ఉందని, సుందరయ్యను అభినందిస్తూ అంకిత స్వీకర్త రమణాచారికి కృతజ్ఞతలు తెలుపుతూ ఇరువురిని ఘనంగా సత్కరించారు.

గ్రంథాలను ఆవిష్కరిస్తున్న కిషన్‌రావు, రమణాచారి, సుందరయ్య, రఘుశ్రీ తదితర అతిథులు

కేసీఆర్‌కు రోజులు దగ్గర పడ్డాయి
- కార్పొరేటర్ దేవర కరుణాకర్

మెహిదీపట్నం, ఆగస్టు 29, ప్రభాతవార్త : ముఖ్యమంత్రి కేసీఆర్ మజ్లిస్ నేతలకు తలొగ్గి హిందువుల మనోభావాలను దెబ్బతీస్తూ రాజకీయ పబ్బం గడుపు తున్నారని గుడిమల్కాపూర్ డివిజన్ కార్పొరేటర్, హైందవ శక్తి నాయకులు దేవర కరుణాకర్ విమర్శించారు. సోమవారం గుడిమల్కాపూర్ డివిజన్ తాళ్లగడ్డ హనుమాన్ దేవాలయంలో గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు త్వరగా బెయిల్ రావాలని కోరుకుంటూ మహా హారతి కార్యక్రమాన్ని నిర్వహించడంతో పాటు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ దేవర కరుణాకర్ మాట్లాడుతూ...ప్రశాంతంగా ఉన్నటువంటి భాగ్యనగరంలో మతకలహాలు సృష్టించి రాజకీయ ప్రయోజనం పొందాలనుకుంటున్న కేసీఆర్ కొత్త డ్రామాకు తెరలేపారన్నారు. అందులో భాగంగానే గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను అరెస్టు చేసి జైలుకు పంపించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో హైందవ శక్తి నాయకులు బోడి అశోక్ యాదవ్, నామ యాదగిరి నేత, రాచకొండ శ్రీకాంత్ సాగర్, సుధాకర్ యాదవ్, అశ్విన్ మోదీ, ప్రభు పూజారిలు పాల్గొన్నారు.

రాజాసింగ్‌కు మద్దతుగా హైందవ శక్తి నాయకులు

తెలుగులో వాడుక భాషోద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి

చిక్కడపల్లి, ఆగస్టు 29, ప్రభాతవార్త : తెలుగులో వాడుక భాషోద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి అని తెలంగాణ సమాచార హక్కు చట్టం చీఫ్ కమిషనర్ బుద్దా మురళీ అన్నారు. సోమవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాలలిత కళావేదికలో ప్రముఖ సాహితీవేత్త గిడుగు రామమూర్తి పంతులు జయంతి సభ గానసభ అధ్యక్షులు కళావిఎస్.జ నార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. బుద్దా మురళీ మాట్లాడుతూ గ్రాంధికభాష లో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుకభాషలోకి తీసుకువచ్చి, నిత్య వ్యవహారంలోని భాషలో ఉన్న అందాన్నీ, వీలునూ తెలియచేసిన మహనీయు డు గిడుగు రామమూర్తి అని అన్నారు. ఆంధ్రదేశంలో వ్యావహారిక భాషో ద్యమానికి మూలపురుషుడు అని అన్నారు. బహుభాషా శాస్త్రవేత్త, చరిత్రకా రుడు, సంఘసంస్కర్త, హేతువాది గిడుగు రామమూర్తి అని అన్నా రు. పం డితులకే పరిమితమైన సాహిత్య సృజనశక్తిని సామాన్యులకు అందుబాటులోకి తెచ్చిన ఘనత గిడుగువారిదేనని అన్నారు. నిమ్న వర్గాల కోసం ప్రత్యేకంగా గ్రంథాలను రాసి వారిలో చదువుపట్ల ఆసక్తిని పెంపొందించిన మహనీయుడు గిరుడు అని అన్నారు. గిడుగు చేసిన కృషి ఫలితంగానే వ్యవహారిక భాషలోని సాహిత్యమంతా మారి, సామాజిక చైతన్యానికి బాటలు వేశారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గాయకుడు చింతలపూడి త్రినాథరావు, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ, చిక్కా రామదాసు, మల్లం రమేశ్ పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న బుద్దా మురళీ

బిసిహాస్టళ్లు, గురుకులాల్లో వంటశాలలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోండి
- బిసి విద్యార్థి సంఘం అధ్యక్షులు విక్రంగౌడ్ వినతి

హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త : రాష్ట్రంలోని బిసివసతి గృహాల్లో, బిసిగురుకుల పాఠశాలల్లో వంటశాలలు చాలా అపరిశుభ్రంగా ఉంచుతున్నారని దాని వల్ల విద్యార్థులు అనేక వ్యాధులకు గురవుతున్నారని బిసి సంక్షేమశాఖ ప్రధాన కార్యదర్శి బుర్రా వెంకటేశంకు బిసి విద్యార్థి సంఘం కోరింది. ఈమేరకు సోమవారం సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రంగౌడ్ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం బుర్రా వెంకటేశంను కలిసి వినతిపత్రం అందజేసింది. ఈసందర్భంగా విక్రంగౌడ్ మాట్లాడుతూ చాలా హాస్టళ్లలోని వంటశాలల్లో మిగిలిన వ్యర్థాలు తొలగించక పోవడంతో దోమలు బొద్దింకలు చేరి అక్కడి ప్రాంగణంలో అపరిశుభ్రతకు దారితీస్తున్నాయన్నారు. నగరానికి దూరంగా ఉన్న హాస్టళ్లలో కనీసం తనిఖీలు లేవని కూరగాయలు ఇతర వంటసామాగ్రి ఒకేసారి తెచ్చిపెట్టడంతో కుళ్ళిపోయి వాసన వస్తున్నాయని వీటిపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే స్పెషల్ అబ్జర్వర్లను నియమించి తనిఖీలు చేయించాలన్నారు. అలాగే ప్రీమెట్రిక్, పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలో గురుకుల పాఠశాలల బాత్రూంలు అధ్వానంగా మారాయిని ప్రతిరోజు శుభ్రం చేయడం లేదన్నారు. కావున విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అదికారులను ఆదేశాలు జారీ చేయాలని కోరగా వెంటనే స్పందించి అధికారులు తనిఖీ చేసి రిపోర్టు చేయాలని ఆయన ఆదేశించారనని విద్యార్థులకు నష్టం కలిగించే చర్యలు ఏవీ ఉపేక్షించేది లేదని విద్యార్థులకు ఏసమస్య ఉన్నా తనదృష్టికి తేవాలని తెలిపినట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు సింగం నగేష్, ఇంద్రమ్ రజక, పాలకూరి కిరణ్, అర్జున్, గౌతమ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బుర్రావెంకటేశంకు వినతిపత్రం ఇస్తున్న విక్రంగౌడ్

కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయం
రాష్ట్ర మంత్రి మల్లారెడ్డి

చిక్కడపల్లి, ఆగస్టు 29, ప్రభాతవార్త : కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా టిఆర్ఎస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పనా శాఖ మంత్రి సి.మల్లారెడ్డి పేర్కొన్నారు. సూపర్‌మాక్స్ పర్సనల్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ యూనియన్ అధ్యక్షుడు, టిఆర్ఎస్ రాష్ట్ర నేత వి.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డిని కలిసి ఎంప్లాయిస్ యూనియన్, కంపెనీకి సంబంధించిన సమస్య లపై వినతిపత్రాన్ని సమర్పించారు. త్వరలోనే అన్ని సమస్యలు పరి ష్కారమవుతాయని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కంపెనీ సీఈఓ కెన్నీ అబ్రహం, సురేంద్ర గుప్త, తెలంగాణ సీఈఓ బ్రహ్మయ్య, మాధవి, శ్రీనివాస్ తదితరులు ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పాల్గొన్నారు.

వినతిపత్రాన్నసమర్పిస్తున్న వి.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నేతలు

ప్రభుత్వ స్థలాలను కాపాడాలి
- సిపిఎం డిమాండ్

అడ్డగుట్ట, ఆగస్టు 29, ప్రభాతవార్త : దక్షిణ భారత దేశంలో అతి పెద్ద మురికివాడగా పేరొందిన అడ్డగుట్ట ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కేటాయించిన 50 పడకల అసుపత్రి నస్థలాన్ని కొందరు భూ కబ్జా దారులు ఆక్రమించుకున్నారని, ఆ స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని వెంటనే యాభై పడకల ఆసుపత్రిని నిర్మించాలని డిమాండ్ చేస్తూ సోమవారం అడ్డగుట్టకు చెందిన సిపిఎం నాయకులు మారేడ్‌పల్లి డిప్యూటీ తహశీలార్ శివకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆర్.మల్లేశ్, ఎం.అజయ్ బాబు, ఎం.గోపాల్, ఆర్.అంజమ్మ, ఎం.స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ఈటెల రాజేందర్‌ను పరామర్శించిన బిజెపి నేత మాధవరం కాంతారావు

రాజేందర్ తండ్రి మల్లయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మాధవరం కాంతారావు

కెపిహెచ్‌బి కాలనీ, ఆగస్టు 29, ప్రభాతవార్త : హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్‌ను కూకట్‌పల్లి బిజెపి అసెంబ్లీ ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావు సోమవారం పరామర్శించారు. ఇటీవల ఈటెల రాజేందర్ తండ్రి మరణించిన సంగతి విధితమే. కాగా ఈటెల రాజేందర్ స్వగ్రామం హుజురాబాద్ నియోజకవర్గం కమలాపూర్‌లో ఇంటికి వెళ్ళి ఈటెల రాజేందర్ తండ్రి మల్లయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా నాయకులు తిరుపతి, డాక్టర్ కొరడాల నరేష్, కెపిహెచ్‌బి డివిజన్ ప్రెసిడెంట్ వినోద్, హరిబాబు పాల్గొన్నారు.

విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలి : రామకృష్ణారెడ్డి

నార్సింగి, ఆగస్టు 29, ప్రభాతవార్త : విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి మణికొండ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మణికొండ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పేరెంట్స్- టీచర్స్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి, విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఆంగ్ల మాధ్యమంలో విద్యా బోధన చేస్తుండడంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని, తరగతి గదులు సరిపోవడం లేదని, అదనపు గదులు కావాలని ఉపాధ్యాయులు తెలిపారు. అనంతరం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ మణికొండ ప్రభుత్వ పాఠశాలలో కార్పోరేట్ స్థాయి విద్యను బోధిస్తుండడం వలన ఏటేటా విద్యార్థుల సంఖ్య పెరుగుతుందన్నారు. దాతల సహకారంతో విద్యా వాలెంటీర్లను నియమిస్తున్నామని, నోటు పుస్తకాలు, బ్యాగులు, షూలు అందించి ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. అతి త్వరలో మరో ముగ్గురు అదనపు విద్యా వాలెంటీర్లను నియమిస్తామని, తరగతి గదుల సమస్యను కూడా పరిష్కరిస్తామని రామకృష్ణారెడ్డి హామీనిచ్చారు. అంకిత భావంతో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుల నుంచి విద్యార్థులు శ్రద్ధగా చదువులు నేర్చుకోవాలని సూచించారు. చదువు ఒక్కటే ఉన్న స్థానం నుంచి ఉన్నత స్థానంలోకి తీసుకెళ్తుందని, మనకు ఉజ్వల భవిష్యత్తును ఇస్తుందని వివరించారు. చదువు, సంస్కారం, గౌరవభావం, దేశభక్తి వంటి మంచి లక్షణాలను విద్యార్థులలో పెంపొందించే బాధ్యత గురువులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నిరంజన్‌రెడ్డి, పుర ప్రముఖులు జంగయ్య, శ్రీనివాస్, సత్యారెడ్డి, భరత్‌రెడ్డి, ఏర్పుల కుమార్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కొండకళ్ల రామకృష్ణారెడ్డి

త్యాగరాయ గానసభలో 'బృందావనం నృత్య సమ్మోహనం'

చిక్కడపల్లి, ఆగస్టు 29, ప్రభాతవార్త : తెలంగాణ పోక్ ఆర్ట్ అకాడమి అధినేత విక్కి మాస్టర్ ఆధ్వర్యంలో చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో 'బృందావనం నృత్య సమ్మోహనం' పేరుతో సాంస్కృతిక కార్యక్రమం సోమవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో జరిగింది. ఈ కార్యక్రమంలో విశ్రాంత జడ్జ్ బూర్గుల మధుసూదన్ హాజరై పురస్కారాలను అందించారు. కార్యక్రమంలో డాక్టర్ మల్లెపూల వెంకటరమణ, సంఘసేవకులు వీరభోగ వసంతరాయలు, కూచిపూడి నాట్యగురు సునంత, తదితరులు పాల్గొన్నారు. నాట్యగురువులు చందా స్వాతి, బిందుశ్రీ, మంజుల, ప్రశాంతి 'శివ నంది' పురస్కారాలతో సత్కరించారు.

మట్టి గణపతులనే పూజించాలి

ప్రతిమలను పంపిణీ చేస్తున్న మహాలక్ష్మీరామన్‌గౌడ్

అందజేస్తున్న టీ.ఎన్.శ్రీనివాస్ తదితరులు

పంపిణీ చేస్తున్న లింగాని ప్రసన్న శ్రీనివాస్

హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త : వినాయకచవితిని పురస్కరించుకుని నల్లకుంట డివిజన్‌లోని శ్రీవిద్య హైస్కూల్‌లో మట్టి వినాయకుడి ప్రతిమల పంపిణి సోమవారం జరిగింది. డివిజన్ కార్పోరేటర్ అమృత పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు శ్యామ్‌రాజు, లక్ష్మి, యాదగిరి, ధర్మేందర్ పలువురు బిజెపి నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

హైదరాబాద్ : పర్యావరణ పరిరక్షణకు భక్తులందరు మట్టి వినాయకుడి విగ్రహాలను పూజించాలని హిమాయత్‌నగర్ డివిజన్ కార్పోరేటర్ జి.మహాలక్ష్మీరామన్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు డివిజన్‌లోని పలు ప్రాంతాలలో భక్తులకు ఉచితంగా మట్టి వినాయకుడి విగ్రహాలను పంపిణి చేసిన సందర్భంగా ఆమె మాట్లాడారు. పర్యావరణను రక్షించడం అందిరి బాధ్యతని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రామన్‌గౌడ్, నర్సింగ్‌ముదిరాజ్, సత్యనారాయణలాల్, మలేష్, శివ, శేఖర్, సుధాకర్, ప్రవీణ్, వేణుగోపాల్‌యాదవ్, పూజా జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డగుట్ట : కాలుష్య నివారణకు, పర్యావర ణ పరిరక్షణకు మట్టి గణపతులను పూజించాలని అడ్డగుట్ట డివిజన్ కార్పోరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్ సూచించారు. సోమవారం అడ్డగుట్టలో స్థానికులకు మట్టి గణపతులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లింగాని మాట్లాడుతూ కెమికల్స్‌తో తయారు చేసిన గణపతుల ను పూజిస్తే పర్యావరణం కలుషితం అవుతుందన్నారు. అందు వల్ల కాలుష్య నివారణ కు, కాలుష్య నివారణకు మట్టి గణపతులను వాడా లన్నారు. ఈ కార్యక్రమంలో నగర గ్రంథాలయ డైరెక్టర్ లింగాని శ్రీనివాస్, టిఆర్ఎస్ నాయకులు నక్క మధు, సత్తయ్య గౌడ్, శంకర్, శివకుమార్, సుధా, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్ : గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో మట్టి గణపతులనే పూజించాలని బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం 2వ వార్డు అన్నా నగర్‌లోని స్థానికులకు మట్టి గణపతులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు నర్సింహ్మ, దేవరాజ్, ప్రకాశ్, పొన్నాల బాబు తదితరులు పాల్గొన్నారు.

టిఆర్ఎస్ ప్రభుత్వంలోనే బోనాల ఉత్సవాలకు నిధులు విడుదల చేసింది

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

బోనాల ఉత్సవాలకు ఆర్థిక సహాయం చెక్కులను అందజేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

కంటోన్మెంట్, ఆగస్టు29 ప్రభాతవార్త: ప్రైవేట్ దేవాలయాలకు ఆర్థిక సహాయం అందజేస్తున్న ఘనత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికే దక్కిందని రాష్ట్ర పశుసంవర్ధక, సినిమాటోగ్రాఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. బోనాల ఉత్సవాల నిర్వాహనకు సనత్ నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని 81 దేవాలయాలకు మంజూరైన 21 లక్షల రూపాయల చెక్కులను సోమవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తలసాని నివాసంలో అమ్మవారి ఆలయాల నిర్వాహకులకు తలసాని చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోనాల ఉత్సవాలను రాష్ట్ర పండుగగా టిఆర్ఎస్ ప్రభుత్వమే ప్రకటించిందన్నారు. తెలంగాణ సాంస్కృతిని చాటి చెప్పే బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రతి ఏటా 15 కోట్లు ప్రభుత్వం విడుదల చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కురుమ హేమలత, లక్ష్మి, మహేశ్వరీ, మాజీ కార్పొరేటర్లు ఆకులరూప, అత్తెల్లి అరుణ శ్రీనివాస్ గౌడ్, శేషుకుమారి, టిఆర్ఎస్ నాయకులు అకుల హరిక్రిష్ణ నాగులు, అత్తెల్లి శ్రీనివాస్ గౌడ్, లక్ష్మిపతి, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్లు క్రిష్ణ, శ్రీనివాస్ శర్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనారోగ్యంతో బాధపడుతున్న 47 మంది లబ్ధిదారులకు మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మంత్రి చేతుల మీదుగా అందజేశారు.

ప్రకృతితో మమేకం అవుతూ మట్టి గణపతిని పూజిద్దాం

గజ్జల యోగానంద్

మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న యోగానంద్

కెపిహెచ్‌బి కాలనీ, ఆగస్టు 29, ప్రభాతవార్త : శేరిలింగంపల్లి నియోజకవర్గం కంటెస్టెంట్ ఎమ్మెల్యే, అసెంబ్లీ ఇన్‌చార్జ్ గజ్జల యోగానంద్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని వివేకానంద నగర్, ఆల్విన్‌కాలనీ, హైదర్ నగర్ డివిజన్‌లలో 30వేల మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యోగానంద్ మాట్లాడుతూ ప్రకృతిలో మమేకం అవుతూ మట్టి గణపతిని పూజించాలని, పర్యావరణంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి వ్యక్తి కూడా పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేయాలని ఆయన కోరారు. శేరిలింగంపల్లిలోని అన్ని డివిజన్‌లలో ఆయన మట్టి గణపతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్‌ల అధ్యక్షులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే దేశం అభివృద్ధి చెందుతుంది

సైఫాబాద్, ఆగస్టు 28 ప్రభాతవార్త: చదువుతోపాటు క్రీడలలో కూడా రాణించినప్పుడే దేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టీస్.బి.చంద్రకుమార్ చెప్పారు. తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఎవి కాలేజీలో జరిగిన జాతీయ క్రీడల దినోత్సవ సభలో ఆయన ప్రసంగించారు. క్రీడలు అడటం వల్ల మానసిక వత్తిడి నుంచి బయటపడవచ్చునని చెప్పారు. క్రీడాకారులకు వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో ఉద్యోగాలలో రిజర్వేషన్‌ల కోటా లభిస్తుందన్నారు. ఉస్మానియా యూనివర్సిటి ప్రొఫెసర్ సత్యనారాయణ మాట్లాడుతూ క్రీడారంగంలో తాను సాధించిన అవార్డులు, పతకాలపై వివరించారు. కౌన్సిల్ అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణముదిరాజ్ మాట్లాడుతూ ప్రముఖ హాకి క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ మెమోరియల్ అవార్డు ఈ సారి రాష్ట్రం నుంచి ఒక్కరే ఎంపిక చేయడం జరిగిందని, ఎంపికైన ప్రొఫెసర్ సత్యనారాయణను చంద్రకుమార్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రాజలింగం, వెంకన్న, లక్ష్మణరావుగుప్తా పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలనే పూజిద్దాం: ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

మట్టి విగ్రహాలను పంపిణి చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కన్నె ఉమారమేష్‌యాదవ్, దిడ్డి రాంబాబు

హైదరాబాద్, ఆగస్టు 29 ప్రభాతవార్త : పర్యావరణ హితం ఉండే మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. కాచిగూడ డివిజన్ చెప్పల్‌బజార్‌లో స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్‌తో కలిసి మట్టి విగ్రహాలను పంపిణి చేవారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి వినాయక విగ్రహాలను పూజిద్దాం, పర్యావరణాన్ని రక్షిద్దాం అనే నినాదంతో అందరూ మట్టి గణపతులను పూజించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, డిఎంసి వేణుగోపాల్, ఎఎంహెచ్‌వో జ్యోతిబాయి, జిహెచ్ఎంసి మాజీ ఫ్లోర్‌లీడర్ దిడ్డి రాంబాబు, టిఆర్ఎస్ నాయకులు సదానంద్, దాత్రిక్ నాగేందర్ బాబ్జీ,భీష్మ, బిజెపి నాయకులు కన్నె రమేష్‌యాదవ్, సుభాష్‌పటేల్, బల్వీర్, భీమ్‌రాజ్, రవియాద్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు సహకరించాలి

కార్పొరేటర్ లక్ష్మీబాల్‌రెడ్డి

మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ లక్ష్మీబాల్‌రెడ్డి

సంజీవరెడ్డి నగర్, ఆగస్టు 29, ప్రభాతవార్త : ప్రతీ ఒక్కరూ మట్టి గణపతిని పూజించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కార్పొరేటర్ లక్ష్మీబాల్‌రెడ్డి సూచించారు. సోమవారం ఎస్సార్‌నగర్ సీనియర్ సిటీజన్స్ కౌన్సిల్ ప్రాంగణంలో సనత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి దంపతుల చేతుల మీదుగా వినాయక మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం కొలను లక్ష్మీబాల్‌రెడ్డి దంపతులకు సీనియర్ సిటీజన్స్ కౌన్సిల్ అధ్యక్షుడు సహదేవ్‌గౌడ్, అనంతరెడ్డిలు కౌన్సిల్ సభ్యులు కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వినాయక చవితి పండగ సందర్భంగా వినాయకుడి ప్రతిమ కెమికల్ రూపంలో పర్యావరణానికి మనమందరం దోహదపడాలని, మట్టి వినాయకునికి పూజలు నిర్వహించి మన పరిసరాలను ప్రకృతిని కాపాడుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన సీనియర్ సిటీజన్స్ కౌన్సిల్ అధ్యక్షుడు సహదేవ్‌గౌడ్‌ను, అనంతరెడ్డిని సీనియర్ సిటీజన్స్ కౌన్సిల్ సభ్యులందరిని కార్పొరేటర్ అభినందించారు.

శ్రీనివాస్‌మూర్తికి ఘనంగా సత్కారం

ఎం.శ్రీనివాసమూర్తిని సత్కరిస్తున్న మధుసూదనాచారి. చిత్రంలో శ్రీనివాస్‌గుప్తా తదితరులు

సైఫాబాద్, ఆగస్టు 29 ప్రభాతవార్త: తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా మహమ్మారి కరోనా వైరస్ నుంచి రోగులను కాపాడేందుకు విశేషమైన సేవలు అందించిన కింగ్‌కోఠి జిల్లా వైద్యశాల ల్యాబ్ టెక్నిషియన్లు ఎం.శ్రీనివాసమూర్తి, ఎం.నర్సింహారెడ్డిలను తెలుగు విశ్వవిద్యాలయంలో పలువురు ప్రముఖులు ఘనంగా సత్కరించారు. తెలంగాణ రాష్ట్ర పర్యాటక సంస్థ ఛైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్. మధుసూదనాచారి తదితరులు వారిని ఘనంగా సత్కరించారు.

బండారి ప్రకాష్‌గౌడ్ విగ్రహాన్ని మాయం చేసిన వారిపై చర్యలు తీసుకోండి

కాంగ్రెస్ నేత యుగంధర్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి డిమాండ్ చేస్తున్న యుగంధర్‌రెడ్డి

కెపిహెచ్‌బి కాలనీ, ఆగస్టు 29, ప్రభాతవార్త : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాలానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు బండారి ప్రకాష్‌గౌడ్ విగ్రహాన్ని మాయం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సోమవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎం.యుగంధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బాలానగర్‌లో గల బండారి ప్రకాష్‌గౌడ్ విగ్రహాన్ని శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసి మాయం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. విగ్రహాన్ని మాయం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకునే వరకు కాంగ్రెస్ పార్టీ ఉద్యమిస్తూనే ఉంటుందని యుగంధర్‌రెడ్డి తెలియజేశారు.

వినాయక ప్రతిమపై చిత్రలేఖనం పోటీలు

నాంపల్లి, ఆగస్టు 29 ప్రభాతవార్త : జాతీయ సమైక్యత, మతసామరస్యం, సౌభాతృత్వం పటిష్టపరిచేందుకు, పర్యావరణ పరిరక్షణకు మట్టితో చేసిన వినాయకుని విగ్రహాలను మాత్రమే పూజించేలా అవగాహన కల్పించడానికి నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ లోని జవహర్ బాలభవన్‌లో బాలభవన్ ఆధ్వర్యంలో ఈరోజు 30వ తేదీ మంగళవారం వినాయక చవితి పండుగను పురస్కరించుకొని వినయక ప్రతిమపై చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు బాలభవన్ డైరెక్టర్ ఉషారాణి విలేకరులకు తెలిపారు. వినాయకుని ప్రతిమ అంశంగా నిర్వహిస్తున్న ఈ పోటీలు ఉదయం 11గంటలకు ప్రారంభమవుతాయని, ఈ పోటీలు సీనియర్, జూనియర్, సబ్‌జూనియర్ విభాగాలుగా జరుగుతాయని తెలిపారు. ఈ పోటీలో కేవలం జవహర్ బాలభవన్, హైదరాబాద్‌లో సభ్యత్వమున్న పాఠశాలల విద్యార్థులు మాత్రమే పాల్గొనేందుకు అర్హులని, సభ్యత్వం లేనివారు అప్పటికప్పుడు సభ్యత్వం తీసుకొని పాల్గొనవచ్చునని, పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు బాలభవన్ కేవలం తెల్లని డ్రాయింట్ చార్ట్ మాత్రమే ఇస్తుందని, చిత్రలేఖనానికి కావాల్సిన వస్తువులన్నీ అభ్యర్థులే తెచ్చుకోవాలని స్పష్టం చేశారు. పోటీలో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేయడం జరుగుతుందన్నారు.

పెన్షన్లు ప్రతినెలా ఒకటో తేదీనే ఇవ్వాలి - పెన్షనర్ల జెఏసి

హైదరాబాద్, ఆగస్టు 29, ప్రభాతవార్త : పెన్షనర్ల జీతాలు ప్రతినెలా మొదటి తారీకుననే పెన్షన్లు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల జేఏసి (పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి) ప్రభుత్వానికి డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం నాడు ఛైర్మన్ కె. లక్ష్మయ్య అధ్యక్షతన కోర్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, తీర్మానాలను లక్ష్మయ్యతో పాటు సెక్రటరీ జనరల్ టి . సుధాకర్ రావులు మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. పెన్షనర్ల జీవితాలు నెల మొదటి తారీఖుతో ముడి పడి ఉంటాయని, నెల మొదటి తారీఖున పెన్షన్ బ్యాంకు ఖాతాలో జమ కాకపోతే ఆందోళన పెరిగి పోతుందని అన్నారు. మెడికల్ బిల్లులు, ఇఎంఐలు, రోజు వారి దినసరి సరుకుల కొనుగోళ్లు, ఇంటి కిరాయి ఇలా ఎన్నో ఉంటాయన్నారు. దీనికి తోడుపెన్షన్ వస్తుందో రాదో అన్న టెన్షన్ అనిశ్చితి నెలకొంటుందన్నారు. తాము సర్వీసులో ఉండగా 10, 15 తేదీలలో వేతనాలు తీసుకోవడం ఎప్పుడు జరగలేదన్నారు. ధనికరాష్ట్రంగా చెప్పుకుంటున్న తెలంగాణలో ఈ పరిస్థితి సరికాదన్నారు. ప్రతి నెలా మొదటి తారీఖునే పెన్షన్లు తమ ఖాతాల్లో జమ అయ్యేట్లు చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. అలాగే ఈ సమావేశంలో బకాయిపడ్డ మూడు డిఆర్ వాయిదాలు కూడా వెంటనే విడుదల చేయాల్సిందిగా కూడా డిమాండ్ చేస్తున్నారు. ఉద్యోగుల ఆరోగ్య పథకం గురించి సవివరంగా చర్చ జరిగిందన్నారు. పిఆర్‌సి సిఫారసు చేసిన పద్ధతిలో పెన్షనర్లందరికీ నగదు రహిత వైద్య సేవలు అందించవలసిందిగా తాము ప్రతిపాదన చేసి సంవత్సరాలు గడచి పోయినా ప్రభుత్వం నుండి ఎలాంటి చలనం లేదన్నారు. ఇప్పటికైనా ఈ సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకొని పెన్షనర్లకు నగదు రహిత వైద్య సేవలు అందుబాటులో ఉంచవలసిందిగా ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ఈ కోర్ కమిటిలో జెఏసి కోకన్వీనర్ ఎం సూర్య నారాయణ, పి. కృష్ణమూర్తి, ఏ రాజేంద్రబాబు, ఎం భరత్ రెడ్డి, సెక్రటరీ జనరల్ సుధాకర్ రావు, వైస్ ఛైర్మన్ ఎస్ జ్ఞానేశ్వర్ కోశాధికారి ప్రసాద్, డిప్యూటి సెక్రటరీ జనరల్ ఎంవి నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

బిఎస్ఎన్ఎల్‌ను మూసి వేసే కుట్ర కేంద్రం చేస్తున్నది

సైఫాబాద్, ఆగస్టు 29 ప్రభాతవార్త: ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థయిన బిఎస్ఎన్ఎల్‌ను నర్వీర్యం చేసి ఆతరువాత మూసి వేసే కపట నాటకాలు ఆడుతున్నదని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ఎస్.బోస్ ఆరోపించారు. కేంద్ర సంస్థగా ఉన్న బిఎస్ఎన్ఎల్ కార్పోరేషన్‌గా మార్చి సమర్థవంతంగా నడుపుతామని ప్రగల్భాలు పలికి తరువాత విఆర్ఎస్ పేరుతో 80 వేల మంది కార్మికులను బలవంతంగా ఇంటికి పంపించడం దారుణమన్నారు. బిఎస్ఎన్ఎల్‌కు ఇచ్చే ఆర్థిక సహకారంపై నియంత్రణ విధించి, 4జీ కేటాయింపులో బిఎస్ఎన్ఎల్‌పై వివక్ష చూపించి ప్రైవేటు సంస్థలకు వంతపాడటం అన్యాయమన్నారు. 5జీ కేంటాయింపులో కూడా 4 కార్పోరేట్ సంస్థలకు అనుకూలంగా నిర్ణయాలు చేసి బిఎస్ఎన్ఎల్‌కు మొండి చేయ్యి చూపించడం అన్యాయమని, 5జీ కేటాయింపుల అక్రమాలు బయటపడకుండా బిఎస్ఎన్ఎల్‌కు లక్షా 60 వేల కోట్లు ప్యాకేజీ ఇస్తే ఇస్తున్నట్లు కేంద్రం ప్రకటించడం దారుణమన్నారు. గత పాలకులు సమీకరించి నిర్మించిన ఆస్తులను అమ్మే హక్కు బిజెపి ప్రభుత్వానికి లేదని, చేతగాని అసమర్థ ప్రభుత్వంగా బిజెపి చరిత్రలో నిలబడి పోతుందని ఆయన హెచ్చరించారు.

సహజసిద్ధమైన మట్టిగణపతులనే పూజించాలి

డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

పంపిణి చేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

తార్నాక, ఆగస్టు 29 ప్రభాతవార్త: పర్యావరణానికి హాని కల్గించకుండా ఆది దేవుడు వినాయక స్వామిని మట్టితో ఏర్పాటు చేసిన ప్రతిమలను ఏర్పాటు చేసుకుంటే బాగుంటుందని జిహెచ్ఎంసీ నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తార్నాకలో ఉచితంగా మట్టిగణపతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణానికి హానికల్గించే పెయింట్స్, రకరకాల రసాయనాలతో తయారు చేసిన గణపతులను కాకుండా సహజసిద్ధమై మట్టి గణపతులనే పూజించాలని డిప్యూటీ మేయర్ విజ్ఞప్తి చేశారు. పర్యావరణాన్ని మన మనవంతుగా కాపాడుకోవలసిన భాధ్యత మనపై ఉందన్నారు. ప్రతి సర్కిల్లో పదివేల విగ్రహాలను పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మోతె శోభన్‌రెడ్డి, ఎఎంహెచ్ఓ డా. రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

మైనర్లకు వాహనం ఇవ్వొద్దు

సంజీవరెడ్డి నగర్, ఆగస్టు 29, ప్రభాతవార్త : బేగంపేట ట్రాఫిక్ ఇన్స్టిట్యూట్ ఇన్స్పెక్టర్ నాగరాజు వారి సిబ్బంది వీరమ్మ, కృష్ణ, రాజేశ్వరరావు ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో హస్మత్‌పేట నారాయణ హై స్కూల్‌లో 9వ, 10వ తరగతి విద్యార్థులకు ట్రాఫిక్ నియమ నిబంధనలపై సోమవారం అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిబ్బంది మాట్లాడుతూ విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా వ్యవహరించాలని, మైనర్లకు ద్విచక్రవాహనాలు ఇవ్వొద్దని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన తరువాత లైసెన్స్ ఎలా తీసుకోవాలని విద్యార్థులకు అవగాహన సదస్సులో తెలియజేశారు. ఒకవేళ మైనర్ మైనర్ పిల్లలు వాహనము నడుపుతూ ట్రాఫిక్ పోలీసులకు దొరికితే తల్లిదండ్రులు జైలుపాలు అవుతారని హెచ్చరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో నారాయణ హై స్కూల్ ప్రిన్సిపల్ డి.శ్రీనివాసరావు, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓ.యూ టీచర్స్ అసోషియేషన్ ఔటా ఎన్నికల ముమ్మర ప్రచారం

అధ్యాపకులతో సూర్య దనుంజయ్ ప్యానెల్

తార్నాక, ఆగస్టు 29, ప్రభాతవార్త : ఓ.యూ టీచర్స్ అసోషియేషన్ ఔటా ఎన్నికల్లో భాగంగా ప్రొ. సూర్య ధనుంజయ్ ప్యానెల్ ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. టెక్నాలజీ కాలేజ్ ఎగ్జామినేషన్ బ్రాంచ్‌లో అసోషియేషన్ ప్రొఫెసర్లు అధ్యాపకులను కలిసి తమకు మద్దతు తెలుపాలని విజ్ఞప్తి చేశారు. మార్పు దిశగా ఓటు వేసి తమ ప్యానెల్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఔటా ప్యానెల్ ప్రసిడెంట్ ప్రొ. సూర్య దనుంజయ్, ప్యానల్ వైస్ ప్రిసిడెంట్ ప్రొ. గడ్డం మల్లేశం, వైస్ ప్రసిడెంట్ విమెన్ ప్రొ. సరస్వతమ్మ రెడ్డి, జనరల్ సెక్రటరీ డా. సిహెచ్ శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ ప్రొ. కె. శశికాంత్ కులకర్ణి, జాయింట్ సెక్రటరీ డ.ఆ ఎం. రాధా కృష్ణ, ట్రెజరర్ డా. చలమల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భద్రత కట్టుదిట్టం చేయాలని వినతి

అప్జల్‌గంజ్, ఆగస్టు 29, ప్రభాతవార్త : ఓవర్గంపై అనుచిత వ్యాఖ్యాలు చేసి పిడియాక్టు కేసులో జైల్‌కు వెళ్లిన గోషామహల్ నియోజకవర్గం బిజెపి శాసనసభ్యులు టి.రాజాసింగ్‌కు జైల్‌లో మరింత భద్రత కట్టుదిట్టం చేయాలని భజరంగ్‌సేనా ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశార. సోమవారం భజరంగ్‌సేనా ఆధ్వర్యంలో జిల్లా రెవెన్యూశాఖ అధికారి సూర్యలతకు వినతి పత్రం అందచేశారు. జైల్‌లో ఉన్న శాసనసభ్యులు రాజాసింగ్‌ను చంపేస్తామని బెదిరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. శివప్రసాద్, ఎన్.ఆర్.లక్ష్మన్‌రావుగుప్త, ప్రవీన్ దూబే, రజనీ, సూర్యశుక్లా, చేతన్, జనార్ధన్ పాల్గొన్నారు.

పిఆర్‌సి విడుదల చేయాలి

గోషామహల్, ఆగస్టు 29, ప్రభాతవార్త : తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ వైద్యులు వెంటనే పిఆర్‌సి విడుదల చేయాలని ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పల్లం ప్రవీణ్ డిమాండ్ చేశారు.సోమవారం ఉస్మానియా ఆసుపత్రిలోని పాతభవనం ప్రాంగణంలో టిజిజిడిఏ ఉస్మానియా ఆసుపత్రి యూనిట్-1 నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. నూతన కార్యవర్గం ప్రతినిధుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వైద్యులకు బకాయి ఉన్న పిఆర్‌సిని వెంటనే విడుదల చేయాలని, ఈఎల్ఎన్ క్యాష్‌మెంట్ జి.ఓ ఇవ్వాలని, 7వ పిఆర్‌సి ప్రకారం రవాణా అలవెన్స్ చెల్లించాలని డిమాండ చేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన టిటిజిడిఏ ఉస్మానియా యూనిట్-1 కార్యవర్గాన్ని పలువురు సన్మానించారు. వైద్యులు రంగా అజ్మీరా,శంకర్‌సింగ్, మురళీకృష్ణ, ఎ.వెంకటకృష్ణ, ఎ.స్వరూపరాణి, వెంకటేశ్వర్లు, కె.రాణి, శ్రావణ్‌కుమార్, రేణుక, ఎ.బాలరాజు, ఎ.లక్ష్మినారాయణ, వీరారెడ్డి, మిరాజ్, మసూద్‌పాషా, అబిద్, స్వర్ణసుధ, శివకుమార్, సాయినాథ్, ఎవిక్రాంతి, అక్బర్‌పాషా, సంధ్యరావు, రవి, ఎ.అనిత తదితరులు పాల్గొన్నారు.

లంగర్‌హౌస్ లేబర్ అడ్డా వద్ద కార్మికులకు అవగాహన

మెహిదీపట్నం, ఆగస్టు 29, ప్రభాతవార్త : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను అర్హులైన కార్మికులందరు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ లీగల్ సర్వీసెస్ అథారిటీ స్పెషల్ సెల్ కమిటీ సభ్యులు రామారావు కోరారు. తెలంగాణ రాష్ట్ర కార్మికశాఖ ఆధ్వర్యంలో కార్వాన్ నియోజకవర్గం లంగర్‌హౌస్ డివిజన్ లేబర్ అడ్డా వద్ద సోమవారం కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమంతో పాటు ఈశ్రమ్ కార్డు నమోదు ప్రక్రియపై కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ.. కార్మిక రంగంలో పనిచేస్తున్న ఎంతో మంది కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలపై అవగాహన లేకపోవడంతోనే వాటిని సద్వినియోగం చేసుకోలేక పోతున్నారని తెలిపారు. కార్యక్రమంలో కార్వాన్ లేబర్ అధికారి కమలాకర్, కార్మిక సంఘం నాయకులు సునీల్, జగన్‌గౌడ్ కార్మికులు ఉన్నారు.

బోనాల చెక్కు అందజేత

అప్జల్‌గంజ్ : నాంపల్లి నియోజకవర్గం టిఆర్ఎస్ ఇన్‌చార్జ్ సిహెచ్.ఆనంద్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిశారు. అనంతరం మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ బోనాల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలొ ప్రదీప్‌కుమార్ అగర్వాల్, బిల్లం నరేందర్, ముత్యాలమ్మ టెంపులు సభ్యులు జెట్టా గోపాల్, భాస్కర్ యాదవ్, అర్జున్ యాదవ్, గిరిధర్, భరత్, శివాంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE XII ADDITIONAL CHIEF JUDGE SECUNDERABAD CITY CIVIL COURT:: AT SECUNDERABAD

O.S.NO.71 OF 2020

BETWEEN:
Yasam Ravi Shanker & others ... PLAINTIFFS
AND
ALL CONCERNED ... DEFENDANT(S)

The public in general are hereby informed that Yasam Siva Rama Krishnaiah and Smt. Y.Ramanuji and their children namely 1. Yasam Ravi Shankar s/o Late Yasam Siva Ramakrishnaiah, 2.Smt. Aruna Sree Garikapati w/o Garikapati Sridhara Chakrvarthy, d/o Late Yasam Siva Ramakrishnaiah, 3. Smt. Kadiyala Naga Sailaja d/o Late Y.Siva Ramakrishna, 4.Yasam Prasad s/o Late Yasam Siva Ramakrishnaiah has filed the above case for declaring them as Legal heirs of deceased Late Yasam Siva Rama Krishnaiah and Smt. Y.Ramanuji, in respect of the schedule property's,

SCHEDULE 'A' OF PROPERTY

All that part and parcel of the property Plot in Sy.No.44 (Old) and 71/2 (New) being part of the compound of House bearing Municipal No.12-10-586 (Old) or 12-11-1595 (new), admeasuring 268 Sq. Yds., equivalent to 224 Sq. Mtrs., situated at Warasiguda Village, Secunderabad, BOUNDED BY:

SCHEDULE 'B' OF PROPERTY

All that part and parcel of the property Agricultural land in Sy.No.28/1 admeasuring Ac.1-00 Cents., land in Sy.No.28/1, admeasuring Ac.0-97 Cents., total admeasuring Ac.1-97 Cents., situated at Manduru Village, Chunduru Mandal, Guntur District, BOUNDED BY :

SCHEDULE 'C' OF PROPERTY

All that part and parcel of the property Plot No.183, admeasuring 133 Sq. yds., and Plot No.184 admeasuring 133 Sq. Yds., Plot No.185 admeasuring 133 Sq. Yds., Plot No.193 admeasuring 133 Sq. yds., Plot No.194 admeasuring 133 Sq. yds., Plot No.195 admeasuring 133 Sq. yds., total admeasuring 798 Sq. Yds., equivalent to 667.78 Sq. Mtrs., in Sy.No.139, in Kalyan's Royale, situated at Chinchod Village and Gram Panchayat, Farrqnagar Mandal, Mahaboobagar District, BOUNDED BY :

SCHEDULE 'D' OF PROPERTY

All that part and parcel of the property Plot No.63, admeasuring 250 Sq. Yds., equivalent to 209.02 Sq. Mtrs., in Sy.Nos.423, 424, 425, 426, 427, 432, 433, 434, 440 and 441, situated at Renuka Singapore Village, Pasmamla Village and Gram Panchayat, Hayathnagar Revenue Mandal, R.R. District, BOUNDED BY:

SCHEDULE 'E' OF PROPERTY

All that part and parcel of the property Agriculture land bearing Sy.No.35/A/1, admeasuring Ac.0-14 Gts., out of Ac.0-26 Gts., Sy. No.35/U, admeasuring Ac.0-07 Gts., out of Ac.0-13 Gts.;, Sy.No.35/A/2, admeasuring Ac.0-07 Gts., out of Ac.0-13 Gts., total admeasuring Ac.0-28 Gts., situated at Dabilguda Revenue Village, Pendyal Gram Panchayat, Maheshwaram Mandal, R.R. District, BOUNDED BY :

SCHEDULE 'F' OF PROPERTY

All that part and parcel of the property Agriculture land bearing Sy.No.35/A/1 admeasuring Ac.0-12 Gts., out of Ac.0-26 Gts., Sy. No.35/U admeasuring Ac.0-06 Gts., out of Ac.0-13 Gts., Sy.No.35/A/2, admeasuring Ac.0-06 Gts., out of Ac.0-13 Gts., total admeasuring Ac.0-24 Gts., situated at Dabilguda Revenue Village, Pendyal Gram Panchayat, Maheshwaram M

మట్టి గణపతులను పూజించి పర్యావరణాన్ని కాపాడాలి

మట్టి గణనాథులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బేతి, కార్పొరేటర్ చేతన

మట్టి విగ్రహాలను అందజేస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి, గద్దె విజయ్‌నేత తదితరులు

మట్టి విగ్రహాలను అందజేస్తున్న కార్పొరేటర్లు పవన్‌కుమార్, అరుణయాదవ్

మట్టి విగ్రహాలను అందజేస్తున్న కార్పొరేటర్లు గీత, రజితారెడ్డి తదితరులు

మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్లు శ్వేత, అరుణ, భాగ్యలక్ష్మి

మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేస్తున్న సామ స్వప్న సుందర్‌రెడ్డి

ఎల్.బి.నగర్, వనస్థలిపురం, ఉప్పల్, మలక్‌పేట, సైదాబాద్, ఆగస్టు 29 ప్రభాతవార్త: హబ్సిగూడ డివిజన్ కాకతీయ నగర్ హరితవనం సమీపంలో జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్, ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ అరుణ కుమారితో కలిసి మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు పర్యా వరణ పరిరక్షణ రక్షణకు మట్టి వినాయకులను పూజించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఇ నాగేందర్, ఎస్‌డబ్ల్యూడి ఈ.చందన, ఏ.ఈ. కీర్తి, హబ్సిగూడ టిఆర్ఎస్ అధ్యక్షుడు డాక్టర్ బి.వీ.చారి, కంచర్ల సోమిరెడ్డి, నాయకులు గరిక సుధాకర్,గాయం శ్రీధర్‌రెడ్డి. లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మూసారాంబాగ్ డివిజన్‌లో... పర్యావరణ పరిరక్షణకోసం మట్టి గణనాథులను పూజించాలని మూసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. డివిజన్‌లోని ఎస్‌బిఐ కానలీలో ప్రజలకు మట్టి గణనాథులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సానిటేషన్ జవాన్ రమేష్, గోవింద్, ముజీబ్, నర్సింగ్‌రావు, శ్రీను, గణేష్, నాయకులు యాదగిరి, సురేందర్, సచిన్, సందీప్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట డివిజన్‌లో... మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలని కొత్తపేటడివిజన్ కార్పొరేటర్ నాయకోటి పవన్‌కుమార్ కోరారు. ప్రజానివాస్ ఫేస్ 2లో అధ్యక్షుడు కొత్త తిరుమల్ ఆధ్వర్యంలో జిహెచ్ఎంసి అధికారులతో కలిసి పవన్‌కుమార్ వినాయక మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సుందర్‌నారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, శ్రావణగౌడ్, శ్రీనివాస్, వెంకటేష్, మహేష్ పాల్గొన్నారు.

నాగోల్‌లో... నాగోల్ డివిజన్‌లోని పలుకాలనీలలో కార్పొరేటర్ చింతల అరుణసురేందర్‌యాదవ్ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలందరూ కాలుష్య నియంత్రణలో భాగంగా మట్టి గణనాథులను పూజించి నాగోల్ చెరువులో నిమజ్జనం చేయాలని కోరారు.

చైతన్యపురిలో... చైతన్యపురి డివిజన్‌లో కార్పొరేటర్ రంగా నరసింహగుప్తా, ఎల్‌వికుమార్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమం ప్రారంభోత్సవం, ప్రభాతనగర్‌కాలనీలో శ్రీకృష్ణుని ఉరేగింపు, చైతన్యపురి డివిజన్ వార్డ్ ఆఫీస్‌లో గణేష్ ప్రతిమలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గణేష్ చవితి దృష్ట్యా చైతన్యపురి డివిజన్‌లోని వివిధ కాలనీలో గణేష్ మండపాలు ఏర్పాటు చేసిన దగ్గర గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని చేపట్టారు.

చిలుకానగర్ డివిజన్‌లో... చిలుకానగర్ డివిజన్‌లో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో మట్టి గణపతులను కార్పొరేటర్ బన్నాల గీత సిబ్బందితో కలిసి పంపిణీ చేశారు. వార్డు కార్యాలయంలో కాలనీ సంక్షేమ సంఘాల అధ్యక్ష కార్యదర్శులకు కమిటీ సభ్యులకు, ప్రజలకు, బొడ్రాయి దగ్గర, బీరప్ప గడ్డ మండే మార్కెట్లో, లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో, విజ్ఞాన్ స్కూల్, తదితర ప్రాంతాలలో మట్టి వినాయకులను అందజేశారు.

రామంతాపూర్‌లో... ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ బండారు శ్రీవాణి తదితరులతో కలిసి జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో రామంతాపూర్‌లో మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేసారు. కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎల్ నాగేందర్, డిఈ చందన, డివిజన్ బిజెపి అధ్యక్షులు బండారు వెంకట్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బి.యన్ రెడ్డి నగర్ డివిజన్‌లో... బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సాహెబ్‌నగర్ కళ్యాణమండపం, ఎన్జీవోస్‌కాలనీ బస్‌స్టాప్, బి.యన్.రెడ్డి.నగర్ ఆటోస్టాండ్‌లో డివిజన్‌కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో ఎఎంఒహెచ్ శ్రీనివాస్, ఎస్ఎస్ అజీమ్‌ద్దీన్, జవాన్ శ్రీనివాస్, నాయకులు సంతోష్‌రెడ్డి, అర్జున్‌గౌడ్, పివిబిడి శర్మ, సంజీవరెడ్డి, నందకిషోర్, భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గద్దె విజయనేత ఆధ్వర్యంలో... బిఎన్‌రెడ్డినగర్ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు గద్దె విజయ్‌నేత ఆధ్వర్యంలో 500 మట్టి వినాయకులను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేయాలని సూచించారు.

ఐఎస్ సదన్ డివిజన్‌లో... మట్టి గణపతులను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని యాకుత్‌పుర నియోజకవర్గం టిఆర్ఎస్ ఇంఛార్జి సామ సుందర్ రెడ్డి, ఐఎస్ సదన్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ స్వప్నలు అన్నారు. సరస్వతినగర్ కాలనీలో మట్టిగణేషుడి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేసిన అనంతరం వారు మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మెట్టు భాస్కర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాస్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

శ్వేత మధుకర్‌రెడ్డి ఆధ్వర్యంలో... ఐఎస్ సదన్ డివిజన్ శివాజి చౌక్ వద్ద కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మట్టి గణనాథులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ తదితర రసాయన పదార్థాలతో చేసిన విగ్రహాలను ఉపయోగించడం వల్ల పర్యావరణానికి హాని కలుగుతుందన్నారు. మట్టితో చేసిన గణనాథులను పూజించి స్వామి వారి కృపకు పాత్రులు కావాలని, ఈ కార్యక్రమంలో స్థానికులతో పాటు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి: మేయర్ పారిజాత

సరూర్‌నగర్, ఆగస్టు 29 ప్రభాతవార్త: పోలీసుల సూచనలు పాటిస్తూ గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ మద్ది మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం జిల్లెలగూడలోని బృందావన్ కన్వెన్షన్ హాల్‌లో నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఉత్సవ కమిటీల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, అధికారులకు ఏర్పాటు చేసిన సమన్వయ, అవగాహన సమావేశానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా

సమావేశంలో ప్రసంగిస్తున్న మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి

పారిజాత మాట్లాడుతూ నవరాత్రులు మొదలుకొని నిమజ్జన శోభాయాత్రలు ముగిసేవరకు సజావుగా జరగడానికి ఉత్సవ సమితి వారు, ప్రజలు, భక్తులు సహకరించాలని సూచించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా విధులు నిర్వహించే పోలీసు, రెవెన్యూ, విద్యుత్, మున్సిపల్ తదితర శాఖల అధికారులు, సిబ్బందికి తోడ్పాటునివ్వాలని ఆమె కోరారు. ఇంకా ఈ సమావేశంలో మీర్‌పేట్ మేయర్ ముదావత్ దుర్గ దీప్‌లాల్ చౌహాన్ తదితరులు మాట్లాడారు. ఇన్స్పెక్టర్ మహేందర్‌రెడ్డి పోలీసు శాఖ తరపున సూచనలు చేశారు. కార్యక్రమంలో బడంగ్‌పేట్ కమీషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, ఎస్ఐలు ఉదయ్ భాస్కర్, రవికుమార్, సత్యనారాయణ, బద్యానాయక్, ఉత్సవ సమితి ప్రతినిధులు కీసర గోవర్ధన్‌రెడ్డి, రామిడి శూరకర్ణారెడ్డి, పస్నూరి బిక్షపతిచారి, కో-ఆప్షన్ సభ్యులు పల్లె జంగయ్యగౌడ్, ఎం.ఎ.రజాక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాల ఏర్పాట్లపై సమావేశం : చైర్ పర్సన్ అనురాధ

సమావేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్ అనురాధ తదితరులు

తుర్కయాంజాల్, ఆగస్టు 29 ప్రభాతవార్త: తుర్కయంజల్ మున్సిపాలిటీ పరిధిలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు మసాబ్ చెరువులో గణేష్ నిమజ్జనం ఏర్పాట్లపై మునిసిపల్ కౌన్సిల్ సబ్యులతో కమిషనర్ ఎంఎన్ఆర్ జ్యోతి ఆధ్వర్యంలో రాగన్నగూడ వార్డ్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ రామ్ రెడ్డి హాజరై మాట్లాడుతూ మున్సిపాలిటీపరిధిలో 31 నుంచి ప్రారంభమయ్యే గణేష్ నవరాత్రి వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలని, మండపాల నిర్వాహకులు అధికారులతో సమన్వయం చేసుకొని ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, అధికారులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

సమాజానికి తమ వంతు సేవలు అందిస్తాం

అంజనీకుమారిని సన్మానిస్తున్న సంస్థ ప్రతినిధులు

మలక్‌పేట, ఆగస్టు 29 ప్రభాతవార్త: సమాజానికి తమ వంతు సేవలు అందిస్తామని నగర సిఎస్‌సి కోర్టు సూపరింటెండెంట్ పివిపి అంజనీకుమారి పేర్కొన్నారు. మదర్ థెరెస్సా జయంతిని పురస్కరించుకొని సావిత్రీభాయ్ పూలే ఫౌండేషన్ అంజనీకుమారి సేవలను గుర్తించి ప్రశంసిస్తూ మదర్ థెరెస్సా జాతీయ పురస్కారాలను అందజేసి ఘనంగా సన్మానించారు. అదే విధంగా వివిధ రంగాలలో నిష్ణాతులైన 38 మంది మహిళలకు ఆమె ఆధ్వర్యంలో జాతీయ పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మహిళ దేశ ప్రగతికోసం తమ వంతు సేవలు అందిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు బోయ మీనగ గోపి, రాధకుసుమ, బడేసాబ్, డాక్టర్ నాగరాజు, వెలుగు నాగార్జున, కవి రాజుకేశవ తదితరులు పాల్గొన్నారు.

జల్‌పల్లి మున్సిపాలిటీలో డెంగ్యూ ప్రబలడానికి అధికారులు, ప్రజాప్రతినిధులే కారణం: అందెల

సమావేశంలో ప్రసంగిస్తున్న అందెల శ్రీరాములు యాదవ్

సరూర్‌నగర్, ఆగస్టు 29 ప్రభాతవార్త: మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ కార్పొరేషన్‌లో డెంగ్యూ, విష జ్వరాలు ప్రబలడానికి అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యమే కారణమని నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములుయాదవ్ ఆరోపించారు. 16వ వార్డు కౌన్సిలర్ బుడమాల యాదగిరి ఆధ్వర్యంలో సోమవారం మున్సిపాలిటీలోని వివిధప్రాంతాలకు చెందిన పలువురు యువకులు అందెల సమక్షంలో బిజెపిలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించిన అనంతరం అందెల మాట్లాడుతూ మున్సిపాలిటీలో డ్రైనేజీలు, పారిశుధ్యం నిర్వహణ సక్రమంగా లేకపోవడం వల్లే ప్రజలు రోగాల బారిన పడుతున్నారని అన్నారు. వర్షాలకు రోడ్లు అస్తవ్యస్తంగా మారాయనీ, డ్రైనేజీలు దారుణంగా తయారయ్యాయనీ, కనీసం దోమలనివారణకు ఫాగింగ్ కూడా చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం మాటలకు చేతలకు పొంతన లేకుండా పోతున్నదని ఆయన ఎద్దేవా చేశారు.

మట్టి వినాయకులను పూజించాలి : మీనా

నేరెడ్‌మెట్ ఆగస్టు 29 ప్రభాతవార్త: పర్యావరణ పరిరక్షణను కాపాడేందుకు మట్టి గణపతులు ఎంతగానో దోహదపడతాయని నేరెడ్‌మెట్ డివిజన్ కార్పొరేటర్ కొత్తపల్లి మీనాఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని జెజె నగర్‌లో ఆమె మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ప్రజలు మట్టి గణపతిని వాడి పండుగను జరుపుకోవాలని కోరారు. మట్టి గణపతిని పెట్టడం ద్వారా పర్యావరణాన్ని కాపాడిన వారమవుతామన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి సర్కిల్ టిఆర్ఎస్ ఉపాధ్యక్షులు కొత్తపల్లి ఉపేందర్ రెడ్డి, నాయకులు యాది, నవీన్, కిశోర్, ఉత్తమ్‌రెడ్డి, రోహత్, బబు, గిరిరెడ్డి, సుబ్రమణ్యం కాలనీ వాసులు పాల్గొన్నారు.

పార్కులతో శారీరక, మానసిక ఉల్లాసం

పార్కు ప్రహారీ పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ స్వప్న, కౌన్సిలర్

హయత్‌నగర్, ఆగస్టు 29 ప్రభాతవార్తః మానసికోల్లాసానికి పార్కులు ఎంతో అవసరమని పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ చైర్‌పర్సన్ చెవుల స్వప్న, కమిషనర్ రామాంజులరెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధి 8వ వార్డులో కళ్లెం బాల్‌రెడ్డి ఫంక్షన్ హాల్ వెనుక భాగంలో ఓపెన్ ప్లేస్‌లో పార్కు ఏర్పాటు కోసం స్థలం కేటాయించి దాని చుట్టూ ప్రహారీ నిర్మాణం కోసం 13 లక్షల రూపాయలు మంజూరుచేశారు. కౌన్సిలర్ పండుగుల జయశ్రీరాజుతో కలిసి ప్రహారీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నడక మానసిక, శారీరక ఒత్తిడిని దూరం చేస్తుందన్నారు. పార్కులో పచ్చదనాన్ని పెంపొందించి ఆహ్లాదంగా తయారు చేస్తామన్నారు. పార్కు స్థలంలో మొక్కలను నాటారు. అనంతరం 15వ వార్డులో 13 లక్షల రూపాయలతో ఏర్పాటుచేయనున్న సీసీరోడ్డు పనులు, 5వ వార్డులో 5 లక్షల రూపాయలతో చేపట్టనున్న డ్రైనేజీ పనులను కౌన్సిలర్లు పాశం అర్చనదామోదర్, బొర్ర అనురాధ సురేష్‌తో కలిసి వారు ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ చామ సంపూర్ణ, డీఈఈ అశోక్‌కుమార్, కౌన్సిలర్లు దండెం కృష్ణారెడ్డి, పసుల రాజేందర్ పాల్గొన్నారు.

వనస్థలిపురంలో రైల్వే రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటు చేయాలి : జక్కిడి ప్రభాకర్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి తదితరులు

వనస్థలిపురం, ఆగస్టు 29 ప్రభాతవార్తః ఆసియా దేశంలోనే అతిపెద్ద రెండవ కాలనీగా గుర్తింపు పొందిన అధిక జనాభా గల వనస్థలిపురంలో ప్రజల సౌకర్యార్థం రైల్వే బుకింగ్ కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని దక్షిణ మధ్య రైల్వే బుకింగ్ సంప్రదింపుల కమిటీ సభ్యులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి రైల్వే అధికారులను కోరారు. సికింద్రాబాద్‌లో దక్షిణ మధ్య రైల్వే ఛీఫ్ జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కమిటీ సమావేశంలో డిజిఎం ముత్యాలు నాయుడుకు విజ్ఞప్తి చేశారు. గతంలో పలుమార్లు వనస్థలిపురం ప్రజలు రైల్వే రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటు చేయాలని కోరడం జరిగిందన్నారు.

అర్హులైన వారికి దళిత బంధు అందించాలి

తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న కెవిపిఎస్ నాయకులు

నేరెడ్‌మెట్ ఆగస్టు 29 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు అర్హులను కలెక్టర్ల ద్వారా ఎంపిక చేయాలని కోరుతూ సోమవారం కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగనిగళల బాలపీరు ఆధ్వర్యంలో మల్కాజిగిరి తహశిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం దళితుల కోసం ప్రతాష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దళితబంధు పథకం అర్హులైన వారికి కాకుండా అనర్హులకు చేరడంలో ఎమ్మెల్యేలు భూమిక వహిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం దళితబంధుకు అర్హులను ఎంపిక చేసే విధానం కలెక్టర్లకు అప్పగించాలని ఆయన డిమాండ్ చేసారు. ప్రస్తుతం ప్రతి నియోజకవర్గానికి 1500 చొప్పున కేటాయించి గ్రామసభల ద్వారా ఎంపిక చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కమిటీ నాయకులు శ్రీనివాస్, ప్రభాకర్, ఈశ్వర్, లలిత, సుజాత, స్వరూప, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బాలాపూర్ చౌరస్తాలో విహెచ్‌పి, భజరంగ్‌దళ్ ఆందోళన

సరూర్‌నగర్, ఆగస్టు 29 ప్రభాతవార్త: గణేష్ నవరాత్రి ఉత్సవాలకు ముందు హైదరాబాద్ నగరంలో వివాదాస్పద మునావర్ ఫారూఖీ షోకు అనుమతి నిచ్చి నగరంలో కల్లోలం రేకెత్తడానికి కారకులైన మంత్రి కెటిఆర్‌ను మంత్రి వర్గం నుండి బర్తరఫ్ చేయాలని విహెచ్‌పి నాయకులు డిమాండ్ చేశారు. ఒక వర్గం వారిని ప్రోత్సహిస్తున్నందకు నిరసనగా తెలంగాణ విహెచ్‌పి ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం బాలాపూర్ చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ టిఆర్ఎస్, కాంగ్రెస్‌కు చెందిన నాయకులు, పోలీసు ఉన్నతాధికారులు ఒక వర్గం వారికే వత్తాసు పలుకుతూ శాంతికి విఘాతం కలిగిస్తున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో బాధ్యులైన అధికారులను సస్పెండ్ చేసి అల్లర్లకు పాల్పడిన యువకులపై కేసులను నమోదు చేసి అల్లర్లకు బాధ్యులైన ఎంఐఎం, టిఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భజరంగ్ దళ్ దిల్‌సుఖ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు అజయ్ యాదవ్, విహెచ్‌పి నాయకులు సాయినాథ్, అరుణ్ సాగర్, అంజిరెడ్డి, నవారు రాజేందర్‌రెడ్డి, రవి, ప్రశాంత్, సమరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాగోల్ డివిజన్‌లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే, కార్పొరేటర్ శంకుస్థాపనలు

కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ అరుణయాదవ్

ఎల్.బి.నగర్, ఆగస్టు 29 ప్రభాతవార్త : నాగోల్ డివిజన్ పరిధిలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణసురేందర్ యాదవ్‌తో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. రూ. 90 లక్షల వ్యయంతో నిర్మించనున్న పలు అభివృద్ధి పనులకు సోమవారం వారు శంకుస్థాపన చేశారు.ఆదర్శనగర్‌కాలనీ, శ్రీనివాసకాలనీ, శివపురికాలనీ, సౌత్ ఎండ్‌పార్క్ కాలనీ, విశాలాంధ్ర కాలనీలలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో డివిజన్ టిఆర్ఎస్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి, నాయకులు ఆనంతుల రాజిరెడ్డి, చెరుకు ప్రశాంత్‌గౌడ్, వస్పరి మల్లేష్ కురుమ, దప్పు రాజు, సూర్వి రాజు, సతీష్‌యాదవ్, జగన్‌మోహన్‌రెడ్డి, తూర్పాటి కృష్ణ, రమేష్, రాంకోటి, భాస్కర్‌యాదవ్ పాల్గొన్నారు.

కేసీఆర్ గడీల పాలన నుంచి ప్రజలకు త్వరలోనే విముక్తిః బండిసంజయ్



సామ రంగారెడ్డిని పరామర్శిస్తున్న బండి సంజయ్

హయత్‌నగర్, ఆగస్టు 29 ప్రభాతవార్తః ఢిల్లి లిక్కర్ స్కాంలో కవితపై వచ్చిన ఆరోపణల చేపథ్యంలో ఆమె ఇంటి వద్ద నిరసన తెలపడానికి వెళ్లి టీఆర్ఎస్ కార్యకర్తలదాడిలో గాయపడిన బీజేపీ అర్బన్‌జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పెద్దఅంబర్‌పేటలోని రంగారెడ్డి ఇంటికివెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి తన కూతురు కవితను కాపాడుకోవడానికి మద్యం కుంభకోణాన్ని పక్కదారి పట్టించేందుకు పోలీసులు, టీఆర్ఎస్ గుండాలతో బీజేపీ కార్యకర్తలపై దాడులుచేయించడం సిగ్గుచేటన్నారు. ఇక కొడుకు కేటీఆర్ మత ఘర్షణలకు ఆజ్యం పోస్తున్నాడని మండిపడ్డారు. తెలంగాణ ప్రజలంతా గమనిస్తున్నారని, త్వరలోనే ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్, చాడసురేష్‌రెడ్డి, తూళ్ల వీరేందర్‌గౌడ్, గంగిడి మనోహర్‌రెడ్డి, కళ్లెం రవీందర్‌రెడ్డి, వనేపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, కళ్లెంనవజీవన్‌రెడ్డి, బద్దంపేరెడ్డి, సామప్రభాకర్‌రెడ్డి, కొత్తరవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

పరభాషలను నేర్చుకున్నా... మాతృభాషను మరువరాదు

హయత్‌నగర్, ఆగస్టు 29 ప్రభాతవార్తః ప్రాథమిక స్థాయిలో తెలుగు బోధన భాషగా ఉన్నప్పుడే విద్యార్థికి తెలుగు మాతృభాషపై అవగాహన సామర్థ్యం పెరుగుతుందని హయత్‌నగర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.జోత్స్నప్రభ అన్నారు. తెలుగు భాషాదినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కళాశాలలో నిర్వహించిన తెలుగుభాష-విశేషాంశాలు అంశంపై సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...దేశభాషలందు తెలుగు లెస్స అన్న నానుడి తెలుగు భాష ఔనత్యాన్ని సూచిస్తుందన్నారు. వ్యవహారిక భాషోద్యమ నాయకుడిగా గిడుగు రామమూర్తి కృషిని ఆమె కొనియాడారు. ఆయన జయంతిని తెలుగు భాషాదినోత్సవంగా జరుపుకోవడం గొప్ప విషయమన్నారు. పరభాషలను ఎన్ని నేర్చుకున్నా మాతృభాషను మరవరాదన్నారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు డా.సురేష్, డా.చింతల రాకేష్‌భవాని, వైస్ ప్రిన్సిపల్ బి.శ్రీనివాస్‌రెడ్డి, ఇంయాజుద్దిన్ ఫారూఖీ పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవ వేడుకలు

సైదాబాద్, ఆగస్టు 29 ప్రభాతవార్త: కర్మన్‌ఘాట్‌లోని క్రాంతి క్లబ్‌ఆవరణలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చంపాపేట డివిజన్ టిఆర్ఎస్ అధ్యక్షుడు ముడుపు రాజిరెడ్డి హాజరయ్యారు. గిడుగు రామ్మూర్తి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించిన అనంతర ం ఆయన మాట్లాడుతూ గ్రాందిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకువచ్చి భాష అందాన్ని, విలువను తెలియచెప్పిన మహనీయులు గిడుగు రామ్మూర్తి అని, అందుకే ఆయన జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట నర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు సునీత, హిమబిందు, ఉష, రాజేష్, డివిజన్ టిఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు రోజారెడ్డి, వసంతరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉమా మహేశ్వర్, మల్లేష్‌గౌడ్, తలారి సత్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మీర్‌పేట్ కార్పొరేషన్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షునిగా బిక్షపతిచారి

సరూర్‌నగర్, ఆగస్టు 29 ప్రభాతవార్త: మీర్‌పేట్ కార్పొరేషన్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షునిగా సిర్లాహిల్స్‌కు చెందిన కార్పొరేషన్ 27వ డివిజన్ కార్పొరేటర్ పసునూరి బిక్షపతిచారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం మహేశ్వరం నియోజకవర్గ గణేష్ ఉత్సవాల సమితి కన్వీనర్ కీసర గోవర్ధన్ రెడ్డి, కో-కన్వీనర్ కోదూరు సోమేశ్వర్‌ల ఆధ్వర్యంలో మీర్‌పేట్ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షునిగా బిక్షపతిచారి, ప్రధాన క